మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

14.04.2025 సోమవారం Monday
సంపుటి (Volume): 09 సంచిక (Issue) : 361
పేజీలు : 8 Pages : 8
Published from : Karimnagar


సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## బెంగళూరు ఘన విజయం

9 వికెట్లతో రాజస్థాన్ చిత్తు.. జైస్వాల్ అర్ధ శతకం




07

# అందరికీ అర్థమయ్యేలా..
# భూ భారతి

ఏకకాలంలో కోటి మంది బ్రౌజ్ చేసినా సవ్యంగా పనిచేసేలా సర్వర్

రంగుల్లో అక్షరాలు.. పంటలకు ఆకుపచ్చ, సాగునీటికి నీలం రంగులతో లోగో
లోగోలో తెలంగాణ తల్లి విగ్రహానికి చోటు
సైబర్ దాడులపై అప్రమత్తంగా ఉండాలి
అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
నేడు అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం భేటీ
నేడే ఆవిష్కరణ.. నాగార్జున సాగర్, తిరుమలగిరి, కీసరలో పైలెట్ ప్రాజెక్టు
566 రైతు వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం




భూ భారతి వెబ్‌సైట్‌ను తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పోర్టల్‌లో వాడే భాషకు సంబంధించిన ఫాంట్ అందరికీ అర్థమయ్యేలా.. ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని సూచించారు.

**హైదరాబాద్, జనతా న్యూస్:** ధరణి స్థానంలో తీసుకురానున్న భూభారతి చట్టం, పోర్టల్, లోగో విషయాల్లో వరుస సమావేశాలు నిర్వహిస్తున్న సీఎం.. శని, ఆదివారాల్లో జరిగిన సమీక్షల సందర్భంగా కీలక సూచనలు చేశారు. భూభారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చాక నాణ్యమైన వనరులున్న సర్వర్‌ను వినియోగించాలని, ఏకకాలంలో కోటి మంది బ్రౌజ్ చేసినా.. సవ్యంగా పనిచేయాలని ఆదేశించారు. "అంతేకాదు.. సాంకేతికత,

మిగతా 2 లో

## జూన్ 2 నుంచి రాష్ట్రమంతా భూ భారతి



ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకే కొత్త చట్టం
మేలో గ్రామ పాలనాధికారుల నియామకం
'ధరణి'తో కొల్లగొట్టిన భూములపై త్వరలో ఆడిట్.. మీడియాతో ఇష్టాగోష్టిలో పొంగులేటి

02



## కర్ణాటకలో ఐదేళ్ల చిన్నారిపై హత్యాచారం

ఎన్‌కౌంటర్‌లో నిందితుడి హతం

02



## అంబేద్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది

అంబేద్కర్‌ను కాంగ్రెస్ వేధించింది
మేం ఆయన కృషిని గౌరవిస్తున్నాం
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
భీం ఆశయ సాధనకు కృషి: సంజయ్

.. వివరాలు 2లో



## బెంగాల్‌లోకి బంగ్లా ఉగ్రవాదం

'వక్ఫ్' అల్లర్లలో జేఎంబీ ఉగ్రసంస్థ.. 7 జిల్లాల్లోకి విస్తరణ
మదర్సాల నుంచి ఎంపికలు..
కేంద్ర నిఘా వర్గాల ఆందోళన
అల్లర్లతో మాల్డాకు పారిపోయిన 400 మంది హిందువులు
కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించండి: బీజేపీ

03



## నేటి నుంచే ఎస్సీ వర్గీకరణ

మూడు గ్రూపులు.. 59 ఉప కులాలు..
మొత్తం 15 శాతం రిజర్వేషన్లు
నేడు ఉదయం 11 గంటలకు జీవో 9 విడుదల చేయనున్న రేవంత్ సర్కారు

02

## గడువు వద్దు

బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు సమయం నిర్దేశించడాన్ని పునఃపరిశీలించాలి
సుప్రీంలో రివ్యూ పిటిషన్ వేయనున్న కేంద్రం
కేంద్రం లేవనెత్తిన పలు అంశాలను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదంటున్న అధికారులు
సాంకేతికంగా రద్దయిన బిల్లులకు ఈ తీర్పు ప్రాణం పోసేలా ఉందని వెల్లడి



04



## సన్నబియ్యం పథకం దేశానికే రోల్ మోడల్

పథకానికి రూ.13వేల కోట్ల ఖర్చు: భట్టి విక్రమార్క

**మధిరటౌన్, జనతా న్యూస్:** సన్నబియ్యం పథకం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని, తెలంగాణ ప్రభుత్వానికి ఇది ఎలా సాధమైందని తెలుసుకునేందుకు ఇతర రాష్ట్రాల వారు రాష్ట్రం వైపు చూస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా మధిరలోని తన క్యాంపు

మిగతా 2 లో

## రాష్ట్రంలో ఎవరూ సంతోషంగా లేరు

అసంబద్ధ హామీలతో సంక్షోభంలో ప్రజల జీవితాలు



03


మోసకారి కాంగ్రెస్‌ను నమ్మితే రోల్డ్ గోల్డ్ కూడా రాదు
తెలంగాణపై కేసీఆర్‌కు ఉండే ప్రేమ ఢిల్లీ పార్టీలకు లేదు
ఇక ఎన్నిక ఏదైనా ఆ పార్టీలకు కర్రుకాల్చి వాత పెట్టాలె
మల్కాజిగిరిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
ఎండను సైతం లెక్క చేయకుండా తరలివచ్చిన శ్రేణులు
కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు నేతలు



## జాకీలు పెట్టినా కాంగ్రెస్ లేవదు

తక్కువ సమయంలోనే రేవంత్ సర్కారు గ్రాఫ్ డౌన్
చెట్ల నరికివేత విషయంలో సామాన్యుడికో న్యాయం రేవంత్‌రెడ్డికో న్యాయమా?
గజ్వేల్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు

04



## బిల్డర్ల సమస్యలను పరిష్కరిస్తాం

పెట్టుబడులకు కేంద్రంగా హైదరాబాద్
సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ వేడుకలో మంత్రి ఉత్తమ్
గత ఏడాది హైదరాబాద్‌లో ఆస్తుల రిజిస్ట్రేషన్లు పెరిగాయ్: సీబీఐ

03



## వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా భారీ నిరసన

అంబేద్కర్ విగ్రహం వద్ద ముస్లింల దీక్ష
హాజరై సంఘీభావం తెలిపిన టీపీసీసీ చీఫ్
బషీర్‌బాగ్‌లో ముస్లింల ర్యాలీ
19న భారీ నిరసన సభ: అసదుద్దీన్ ఒవైసీ

.. వివరాలు 2లో

# నేటి నుంచే ఎస్సీ వర్గీకరణ

**మూడు గ్రూపులు.. 59 ఉప కులాలు.. మొత్తం 15 శాతం రిజర్వేషన్లు**

**గ్రూపు-1కు 1 శాతం, గ్రూపు-2కు 9, గ్రూపు-3కు 5 శాతం వర్తింపు**

**నేడు ఉదయం 11 గంటలకు జీవో 9 విడుదల చేయనున్న రేవంత్ సర్కారు**



**హైదరాబాద్, ఏప్రిల్ 13 :** షెడ్యూల్డ్ కులాల్లో (ఎస్సీ) బాగా వెనుకబడి, రిజర్వేషన్ల ఫలాలను సరిగా పొందలేకపోయిన కులాల కల నెరవేరుతోంది. రాష్ట్రంలో ఎస్సీలకు ఇప్పటివరకు గంపగుత్తగా అమలైన 15శాతం రిజర్వేషన్లు.. ఇక నుంచి వర్గీకరణ ప్రకారం అందనున్నాయి. అందులోనూ గ్రూపులు, కులాల ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం ఉదయం 11 గంటలకు ఎస్సీ గ్రూపులు, కులాల వారీగా అందే రిజర్వేషన్ల వివరాలతో జీవో 9ని విడుదల చేయనుంది. అంతకంటే ముందు ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం సచివాలయంలో భేటీ అవుతుంది. ఉత్తర్వులను విడుదల చేసిన అనంతరం మంత్రులు జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి.. ఎస్సీ రిజర్వేషన్ల అమలు జీవో తొలి కాపీని అందిస్తారు. జీవో అమల్లోకి వచ్చినప్పటి నుంచి వెలువడే అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రకటనలు, విద్యా సంస్థల ప్రవేశాలకు వర్గీకరణ వర్తిస్తుంది. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత దేశంలో ఎస్సీ వర్గీకరణను పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గమనార్హం.

**సుప్రీం తీర్పు వచ్చిన రోజే ప్రకటన**

ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్రాలే నిర్ణయం తీసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు గతేడాది ఆగస్టు 1న తీర్పు ఇచ్చింది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని అదే రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారు. సెప్టెంబర్ 12న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవి సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉప సంఘం సూచన మేరకు 2024 అక్టోబర్ 11న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌తో ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 60 రోజులో కమిషన్ నివేదిక ఇవ్వాలని కోరింది. తర్వాత గడువును ఈ ఏడాది ఫిబ్రవరి 10 వరకు పొడిగించింది. కమిషన్ 2011 జనాభా లెక్కల ఆధారంగా పరిశీలన జరిపి.. ఫిబ్రవరి 3న మంత్రివర్గ ఉప సంఘానికి నివేదిక అందజేసింది. కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీలను 3 గ్రూపులుగా వర్గీకరించి, రిజర్వేషన్‌ను విభజిస్తున్నట్టు ఫిబ్రవరి 4న అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించింది.

**మూడు అంశాల ఆధారంగా వర్గీకరణ..**

జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ రాష్ట్రంలోని 59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించి, జనాభా శాతం ఆధారంగా 15 శాతం రిజర్వేషన్‌ను పంచింది. గ్రూప్-1లో సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, అత్యంత వెనుకబడిన 15 కులాలను చేర్చి 1శాతం, గ్రూప్-2లో మాదిగ, దాని ఉప కులాలను కలిపి 18 కులాలకు 9శాతం, గ్రూప్-3లో మాల, దాని ఉపకులాలను కలిపి 26 కులాలకు 5శాతం రిజర్వేషన్‌ను కేటాయించింది. గ్రూప్-1లో 1,71,625 మంది (3.288శాతం), గ్రూప్-2లో 32,74,377 మంది (62.748శాతం), గ్రూప్-3లో 17,71,1682 మంది (33.963శాతం) జనాభా ఉన్నారని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎస్సీ రిజర్వేషన్ల అమలుకు గ్రూపుల వారీగా ప్రాధాన్యత క్రమం అనుసరించాలని కమిషన్ ప్రతిపాదించింది. గ్రూప్-1లోని కులాల వారితో ఖాళీలు భర్తీ కాకపోతే.. గ్రూప్-2లోని వారితో, గ్రూప్-2లో భర్తీకాని ఖాళీలను గ్రూప్-3లోని కులాల వారితో భర్తీ చేయాలని సూచించింది. ఒకవేళ ఈ మూడు గ్రూపుల్లో తగిన అభ్యర్థులు లేకపోతే ఖాళీలను తర్వాతి నోటిఫికేషన్‌కు కొనసాగించాలని (క్యారీ ఫార్వర్డ్) పేర్కొంది. సాధారణంగా ప్రభుత్వ ఉ ద్యోగాల భర్తీలో రోస్టర్ పాయింట్లు కీలకంగా ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులకు వారి రిజర్వేషన్ల ప్రకారం రోస్టర్ పాయింట్లు ఉంటాయి. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో గ్రూపుల వారీగా ఈ రోస్టర్ పాయింట్లను కూడా కమిషన్ విభజించింది. ఎస్సీ గ్రూప్-1కు 7వ రోస్టర్ పాయింట్, గ్రూప్-2లోని వారికి 2, 16, 27, 47, 52, 66, 72, 87, 97 పాయింట్లను, గ్రూప్-3లోని వారికి 22, 41, 62, 77, 91 రోస్టర్ పాయింట్లను ప్రతిపాదించింది. సోమవారం విడుదల చేసే ఉత్తర్వుల్లో ఈ వివరాలను పొందుపర్చనున్నారు.

**మూడు దశాబ్దాల పోరాటం**

ఎస్సీలను వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేయాలనే డిమాండ్‌తో ఎస్సీల్లోని వెనుకబడిన కులాలు మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నాయి. వారి కలకు ఇన్నేళ్లకు నెరవేరుతోంది. వాస్తవానికి 1997లోనే అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం ఎస్సీ కులాలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వర్గీకరిస్తూ 1997 జూన్ 6న ఉత్తర్వులు జారీ చేసింది. కానీ హైకోర్టులో పిటిషన్లు దాఖలవడంతో ఉత్తర్వుల అమలు నిలిచిపోయింది. వర్గీకరణపై 1998లో ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసినా హైకోర్టులో సవాల్ చేయడంతో ఆగిపోయింది. తర్వాత ఆ కేసు సుప్రీంకోర్టుకు చేరగా.. ఎస్సీ వర్గీకరణను పార్లమెంట్ మాత్రమే చేయగలదంటూ రాష్ట్ర ఆర్డినెన్స్‌ను కొట్టివేసింది. ఇక 2008లో అప్పటి సీఎం వైఎస్సార్ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఉషా మెహ్రా కమిషన్ ఏర్పాటు చేసినా.. ఆ సిఫార్సులు అమలుకాలేదు. తాజాగా 2024 ఆగస్టులో రాష్ట్రాలే ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో తెలంగాణ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టింది. కమిషన్ ఏర్పాటు, వర్గీకరణ ఖరారు, అసెంబ్లీలో బిల్లు ఆమోదం, చట్టబద్ధత దాకా చకచకా పూర్తి చేసింది.

# సన్నబియ్యం పథకం దేశానికే రోల్ మోడల్

మొదటి పేజీ తరువాయి



కార్యాలయంలో ఆదివారం విలేరరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
ధనిక రాష్ట్రమైన తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చారని, పదేళ్ల పాలనలో సన్నబియ్యం ఇస్తామని మాటలు చెప్పడం, పాటలు పాడడమే తప్ప ఏ పేదవాడికి న్యాయం చేసింది లేదని విమర్శించారు. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ. 13,525కోట్లు ఖర్చు చేస్తోందని, 90లక్షల కార్డులతో 2.85 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. మరికొన్ని రోజుల్లో 10 లక్షల కొత్త కార్డులు ఇస్తామని, మొత్తం 3.10కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తామని ఆయన చెప్పారు.

# అందరికీ అర్థమయ్యేలా.. భూ భారతి

మొదటి పేజీ తరువాయి

అవసరమైన బ్యాక్‌పను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలి. ఇందుకోసం వివిధ రాష్ట్రాలు వినియోగిస్తున్న సాంకేతికతపై అధ్యయనం చేయాలి" అని పేర్కొన్నారు. సైబర్ దాడులను ధీటుగా ఎదుర్కొనేలా పోర్టల్‌ను సన్నద్ధం చేయాలన్నారు. "రాజకీయంగా మమ్మల్ని ఎదుర్కోలేనివాళ్లు.. సాంకేతికంగా కృత్రిమ మేధ(ఏఐ)ని వినియోగించి, పోర్టల్‌లో బగ్స్‌ని సృష్టించే ప్రమాదాలున్నాయి. అధికారులు కూడా సైబర్ సెక్యూరిటీపై దృష్టిసారించాలి. ఏఐని వినియోగించుకుని, సర్వర్‌కు, పోర్టల్‌కు భద్రత కల్పించాలి. ఏఐ సాయంతో ఎప్పటికప్పుడు సైబర్ సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించేలా నిఘా ఉంచాలి. పటిష్ఠమైన ఫైర్‌వాల్స్‌ను వినియోగించాలి. అవసరమైతే సైబర్‌క్రైమ్ విభాగం సహకారం తీసుకోవాలి. వందేళ్లు పనిచేసేలా పోర్టల్ ఉ ండాలి. పోర్టల్ రియల్-టైమ్ అనుభవంలో ఊహించని సమస్యలు తలెత్తే ప్రమాదముంది. అలాంటి సమస్యలు వచ్చిన వెంటనే సరిచేయగలగాలి. అందుకే.. ఈ పోర్టల్ నిర్వహణను విశ్వసనీయత ఉన్న సంస్థకు అప్పగించాలి" అని మార్గనిర్దేశనం చేశారు. ధరణితో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను భూభారతి పోర్టల్ పరిష్కరించేలా ఉ ండాలన్నారు. ఇందుకోసం పోర్టల్ అందుబాటులోకి రాగానే.. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని సూచించారు. "భూభారతి విషయంలో అలసత్వం వద్దు. అధికారులు, కలెక్టర్లు నిర్లక్ష్యం వహించినా.. ఏవైనా తప్పులు దొర్లినా ఉపేక్షించేది లేదు" అని సున్నితంగా హెచ్చరించారు. జిల్లాల కలెక్టర్లు ప్రతి మండలంలో భూభారతిపై అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. భూభారతి లోగోపైనా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టిసారించారు. గతంలో డిజైన్ అయిన పలు లోగోలను అధికారులు సీఎంకు చూపించారు. వాటన్నింటినీ ఆయన తిరస్కరిస్తూ.. లోగో విషయంలో కీలక సూచన చేశారు. "పంటలకు సంకేతంగా ఆకుపచ్చ రంగు.. సాగునీటికి సంకేతంగా నీలం రంగును వాడాలి.




అందులో తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిబింబించేలా లోగోను తీర్చిదిద్దాలి" అని అప్పట్లో ఆదేశించారు. ఆ మేరకు చూడముచ్చటైన లోగోను రూపొందించినట్లు తెలిసింది. భూభారతి పోర్టల్‌లో 'తెలంగాణ రైజింగ్' లోగోను కూడా అప్‌లోడ్ చేస్తారని సమాచారం. భూభారతితోపాటు.. హౌసింగ్, వేసవి నేపథ్యంలో తాగునీటిపై సోమవారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం సమావేశం కానున్నారు.

**సందేహాల నివృత్తికి భూ మిత్ర.!**

భూ భారతి చట్టం, దరఖాస్తు విధానం లేదా పోర్టల్‌కు సంబంధించి రైతులకు ఏవైనా సందేహాలు వ్యక్తమైతే.. వాటిని నివృత్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాన్ని తీసుకురానుంది. ఏఐ చాట్‌బోట్ సాయంతో పనిచేసే ఈ వ్యవస్థకు 'భూమిత్ర' లేదా 'భూరక్షక్' అనే పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. భూభారతిని పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్న మండలాల్లో ఈ చాట్‌బోట్‌ను అందుబాటులోకి తీసుకువస్తారని సమాచారం. దీని నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తారని, టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకువస్తారని తెలుస్తోంది.

**ఈ 3 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు**

సోమవారం ఆవిష్కరించే భూ భారతి పోర్టల్‌ను తొలుత మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తారు. నల్లగొండ జిల్లాలోని సాగర్, తిరుమలగిరి, రంగారెడ్డి జిల్లాలోని కీసర మండలాలను పైలట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. పైలెట్ ప్రాజెక్టు సందర్భంగా గుర్తించే సమస్యలను అధ్యయనం చేసి, వాటిని పరిష్కరించిన తర్వాత.. రాష్ట్రవ్యాప్తంగా భూభారతిని అమలు చేయాలని సర్కారు నిర్ణయించింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం(జూన్ 2) నుంచి పూర్తిస్థాయిలో భూభారతి చట్టం అమల్లోకి తీసుకురావాలని భావిస్తోంది. కాగా.. భూభారతి పోర్టల్ ఆవిష్కరణ ప్రత్యక్ష ప్రసారానికి వ్యవసాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 566 రైతువేదికలలో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి వివిధ రైతు వేదికల ద్వారా లక్షల మంది అన్నదాతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తారని వ్యవసాయ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

# జూన్ 2 నుంచి రాష్ట్రమంతా భూ భారతి

**ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకే కొత్త చట్టం**

**మేలో గ్రామ పాలనాధికారుల నియామకం**

**భూ భారతిపై గందరగోళం సృష్టిస్తే చర్యలు**

**వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇదే రెఫరెండం**

**'ధరణి'తో కొల్లగొట్టిన భూములపై త్వరలో ఆడిట్.. మీడియాతో ఇష్టాగోష్ఠిలో పొంగులేటి**




**హైదరాబాద్, ఏప్రిల్ 13 :** "జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలనేది ప్రభుత్వ సంకల్పం. తొలుత మూడు జిల్లాల పరిధిలోని మూడు మండలాల్లో సోమవారం నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తాం. పోర్టల్ మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా అందరికీ అందుబా టులో ఉంటుంది. మూడు మండలాల పరిధిలో అంశా ల వారీగా వచ్చే సమస్యలను అధ్యయనం చేశాక.. వాటి పరిష్కారానికి వీలైనంత త్వరగా నిబంధనల్లో మార్పులు చేస్తాం. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులకు గరిష్ఠంగా పది రోజుల వ్యవధిలో పరిష్కారం చూపాలనే లక్ష్యం నిర్ణయించాం" అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సచివాలయంలో ఆదివారం ఆయన మీడియా తో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. భూభారతి చట్టంపై అపోహలు తలెత్తేలా, ప్రజలను గందరగోళానికి గురి చేసేలా ఎవరు వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. "ఆదివారం సాయంత్రం 5 గంటల తరువాత భూభారతి పోర్టల్ అందరికీ అందుబాటులోకి వస్తుంది. అయితే ఒకేసారి ఎక్కువ మంది లాగిన్ అయితే సర్వర్ మొరాయించే ప్రమాదం ఉంది. భూముల వివరాలను తెలుసుకోవాలనుకుంటే ఎప్పుడైనా పోర్టల్‌లో చూసుకోవచ్చు. ఏ ఒక్క రైతు కూడా అభద్రతకు గురికావాల్సిన పని లేదు. ధరణి సమస్యల నుంచి రైతులను, ప్రజలను కాపాడేందుకే కొత్త చట్టం తీసుకొస్తున్నాం. దీని వల్ల లాభమే తప్ప.. ఎవరికి నష్టం జరగదు. 2029 అసెంబ్లీ ఎన్నికలకు భూభారతిని రిఫరెండంగా కాంగ్రెస్ భావిస్తుంది" అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 6.50లక్షల సాదాబైనామా దరఖాస్తులను తిరస్కరించిందని పొంగులేటి గుర్తు చేశారు. కొత్త చట్టం ప్రకారం అర్హత కలిగిన దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం పార్ట్-బీలో పెట్టిన 18 లక్షల ఎకరాల్లో సుమారు 6 లక్షల ఎకరాల వరకు అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూములు ఉన్నాయని వెల్లడించారు. మిగతా 12లక్షల ఎకరాల్లో వివాదాలు లేని భూములపై వాటి యజమానులకు హక్కులు కల్పిస్తామన్నారు.

**అక్రమాలను ప్రజల ముందు పెడతాం**

భూభారతి అమల్లోకి వచ్చాక.. గతంలో జరిగిన భూ అక్రమాలను బయట పెడతామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఫోరెన్సిక్ ఆడిట్ విషయంలో వెనక్కి తగ్గేది లేదని.. అందుకు సంబంధించిన ఏర్పాట్లూ పూర్తవుతున్నాయన్నారు. అన్ని వివరాలను త్వరలోనే ప్రజల ముందు పెడతామన్నారు. ఇబ్రహీంపట్నంలోని యాచారంలో భూ దందాపైనా నివేదిక సిద్ధమైంద న్నారు. తొమ్మిది నెలల్లో భూభారతి కొత్త పోర్టల్ అందుబాటులోకి వస్తుందని, ప్రస్తుతానికి పాత పోర్టల్‌లోనే పలు మార్పులు చేశామన్నారు. భూభారతి అమల్లోకి వచ్చాక రిజిస్ట్రేషన్లు యథావిధిగా కొనసాగు తాయన్నారు. సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఎవరు ఫిర్యాదు చేసినా విచారణకు స్వీకరించాలని చట్టంలో పొందుపరిచామన్నారు.

గతంలో తొలగించిన వీఆర్వోలు, వీఆర్ఏల నుంచి ఈ నెల 17వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, రాత పరీక్ష ద్వారా ఎంపికైన అభ్యర్థులకు మే మొదటి వారంలో గ్రామపాలన అధికారులుగా నియామక పత్రాలు అందజేస్తామన్నారు. గ్రామాల్లోని భూ సమస్యలను వారు ప్రభుత్వానికి నివేదిస్తారే తప్ప.. ఎలాంటి నిర్ణయాధికారాలు ఉండవన్నారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 1000 మంది సర్వేయర్లను నియమించబోతున్నామన్నారు. వీరితోపాటు మరో 6వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నామని, కర్ణాటకలో మాదిరిగా వారి సేవలను వినియోగించుకుంటామన్నారు. నాలుగేళ్లకు సంబంధించిన పాత రెవెన్యూ రికార్డులను అందుబాటు లో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి కార్యాల యంలో మ్యానువల్ రికార్డులు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. పాస్ పుస్తకాలు లేని వారికి ఆందోళన అవసరం లేదని.. కొత్త చట్టం ప్రకారం అర్హులందరికీ పాస్ పుస్తకాలు జారీ చేస్తామన్నారు.

# కర్ణాటకలో ఐదేళ్ల చిన్నారిపై హత్యాచారం



**ఎన్‌కౌంటర్‌లో నిందితుడి హతం**

**బెంగళూరు, ఏప్రిల్ 13 :** ఇంటిముందు ఆడుకుంటున్న ఐదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశచూపి అత్యాచారానికి పాల్పడ్డాడో మానవమృగం. అనంతరం ఎవరికైనా చెబుతుందనే భయంతో గొంతు నులిమి చంపేశాడు. ఆ తర్వాత పోలీసు కాల్పుల్లో హతమయ్యాడు. కర్ణాటక రాష్ట్రం హుబ్బళ్లి నగరంలో ఆదివారం జరిగిందీ ఘటన. కొప్పళకు చెందిన ఓ కుటుంబం ఉపాధి నిమిత్తం హుబ్బళ్లికి వలస వచ్చింది. చిన్నారి తండ్రి పెయింటర్. తల్లి గృహిణి. ఆదివారం ఉదయం తండ్రి పనికి వెళ్లగా, తల్లి ఇంట్లో పనిచేసుకుంటోంది. చిన్నారి ఇంటి బయట ఆడుకుంటుండగా, ఒక యువకుడు చాక్లెట్ ఆశ చూపి ఆమెను సమీపంలోని ఓ పాడుబడిన షెడ్డుకు తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారానికి పాల్పడి కిరాతకంగా హత్య చేశాడు. తల్లిదండ్రులు తమ ఇంటి సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి ఓ యువకుడు బాలికను ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. షెడ్డులో చిన్నారి శవమై కనిపించడంతో ప్రజా, కన్నడ, యువసంఘాలు పెద్ద ఎత్తున నిరసనకు దిగాయి. మరోవైపు, నిందితుడిని బిహార్‌కు చెందిన రితేశ్‌కుమార్‌గా గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. అతడు తప్పించుకునే ప్రయత్నంలో ఎదురు దాడికి దిగగా పోలీసులు కాల్పులు జరిపారు. రితేశ్‌కుమార్ ఛాతీలోకి బుల్లెట్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనలో ఎస్ఐ, ఇద్దరు సిబ్బంది గాయపడ్డారు.

# కేసీఆర్‌పై కోపంతో అంబేద్కర్‌ను అవమానిస్తున్నారు: కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 13 :** మాజీ సీఎం కేసీఆర్‌పై కోపంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంబేద్కర్‌ను అవమానిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు అంబేద్కర్ స్మృతివనాన్ని సందర్శించి నివాళులర్పించాలని సూచించారు. గత ఏడాది అంబేద్కర్ జయంతికి ముఖ్యమంత్రి, మంత్రులెవరూ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించలేదన్నారు.

# అంబేడ్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది

**అంబేడ్కర్‌ను కాంగ్రెస్ వేధించింది**
**మేం ఆయన కృషిని గౌరవిస్తున్నాం**
**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి**
**భీం ఆశయ సాధనకు కృషి: సంజయ్**



**హైదరాబాద్, ఏప్రిల్ 13 :** రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కాంగ్రెస్ చివరి వరకు వేధించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. అంబేడ్కర్ ఎన్నికల్లో నిలబడితే ఆయనకు వ్యతిరేకంగా నెహ్రూ ప్రచారం నిర్వహించారని అన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం బంజారాహిల్స్‌లోని భీం విగ్రహాన్ని కిషన్‌రెడ్డి కడిగి, అలంకరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్ కృషి, వారసత్వాన్ని గౌరవిస్తూ పలు కార్యక్రమాలను చేపట్టిందన్నారు. అంబేడ్కర్ జీవితానికి సంబంధించిన 5 ముఖ్యమైన ప్రదేశాలను 'పంచ తీర్థాలు'గా తీర్చిదిద్దిందని తెలిపారు. రాజ్యాంగానికి రూపకల్పన చేసి, సామాజిక న్యాయ సంస్కరణలకు అంబేడ్కర్ అసమానమైన కృషి చేసినా, కాంగ్రెస్ ఆయనకు గుర్తింపు ఇవ్వలేదని విమర్శించారు. కనీసం ఆయన చిత్రపటాన్ని పార్లమెంట్‌లో పెట్టేందుకు చర్యలు తీసుకోలేదన్నారు.

**అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది: సంజయ్**

అంబేడ్కర్‌ను ఓడించిన, అవమానించిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 1951లో హిందూ కోడ్ బిల్లు, సామాజిక న్యాయ సాధికారత అంశాలపై అంబేడ్కర్ అభిప్రాయాలను నెహ్రూ వ్యతిరేకించారని, దీంతో మనస్తాపం చెందిన అంబేడ్కర్ మంత్రి పదవికి రాజీనామా చేశారని పేర్కొన్నారు. 1954 ఉప ఎన్నికలో అంబేడ్కర్‌పై అభ్యర్థిని నిలబెట్టి ఆయనను ఓడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో సంజయ్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. కాగా, కాంగ్రెస్ అంబేడ్కర్‌ను అవమానించడం తప్ప గౌరవించలేదని ఎంపీ అర్వింద్ విమర్శించారు. 'చలో గావ్.. చలో బస్తీ' కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్‌లోని పులాంగ్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని అర్వింద్ శుభ్రం చేశారు. పవన్ కల్యాణ్ త్యాగం చేసి రాజకీయాల్లోకి వచ్చారని.. కవిత ఏం త్యాగం చేసి వచ్చిందని ప్రశ్నించారు. కాగా, కంచ గచ్చిబౌలిలోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలను టీజీఐఐసీకి బదిలీ చేసింది వాస్తవం కాదా..? అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. మంత్రి శ్రీధర్‌బాబును ప్రశ్నించారు. ఆ భూములను తాకట్టుపెట్టి రుణం తీసుకోవడంపై శ్రీధర్‌బాబు ప్రజలను తప్పుదోవ పట్టించారని అన్నారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంచ గచ్చిబౌలి భూములను తెలివిగా టీజీఐఐసీకి బదిలీ చేసి, దాని ద్వారా రుణం తీసుకుందని ఆరోపించారు.

## బెంగాల్‌లోకి బంగ్లా ఉగ్రవాదం

**'వక్ఫ్' అల్లర్లలో జేఎంబీ ఉగ్రసంస్థ.. 7 జిల్లాల్లోకి విస్తరణ**
**మదర్సాల నుంచి ఎంపికలు.. కేంద్ర నిఘా వర్గాల ఆందోళన**
**అల్లర్లతో మాల్దాకు పారిపోయిన 400 మంది హిందువులు**
**కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించండి: బీజేపీ**




**కోల్‌కతా, ఏప్రిల్ 13:** కొత్త వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పశ్చిమబెంగాల్‌లో హింస వెనుక బంగ్లాదేశ్‌కు చెందిన ఓ ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ ప్రమేయం ఉన్నట్టు కేంద్ర అత్యున్నత నిఘా వర్గాలు చెబుతున్నాయి. గతంలో బెంగాల్‌లో దాడులు చేసిన చరిత్ర జమాతుల్ ముజాహిద్దీన్ బంగ్లాదేశ్‌కు(జేఎమ్‌బీ) ఉంది. ప్రస్తుతం ఆ సంస్థ తిరిగి బెంగాల్‌పై పట్టు బిగిస్తున్నదని, ఏడు సరిహద్దు జిల్లాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నదని ఈ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఆ జిల్లాల్లోని మదర్సాల నుంచి యువకులను భారీగా జేఎమ్‌బీ నియమించుకుంటోందని చెబుతున్నాయి. ముర్షిదాబాద్, 24 పరగణాల జిల్లాల్లో మొదలైన అల్లర్ల వెనుక ఉన్నది ఈ సంస్థయేనని అంటున్నాయి. దీనివల్ల బెంగాల్ తీవ్రమైన శాంతిభద్రతల సమస్యను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.
ఇస్లామిక్ ఎజెండా కింద తాజాగా వక్ఫ్ ఆందోళనలను రగుల్చుతున్నదనే భయాందోళనలను నిఘా సంస్థలు వ్యక్తం చేస్తున్నాయి. కాగా, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అల్లర్లు జరుగుతున్న ప్రాంతాల్లో ఆదివారం బీఎస్ఎఫ్ కు చెందిన 8కంపెనీల జవాన్లు, వెయ్యిమంది పోలీసులను మోహరించారు. ఇప్పటివరకు 150 మందిని అరెస్టు చేశారు. డీజీ స్థాయి నుంచి అదనపు ఎస్పీ స్థాయి వరకు.. కీలక పోలీసు అధికారులు పరిస్థితులను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇదిలాఉండగా, అల్లర్ల తర్వాత దాదాపు 400 మంది హిందువులు ముర్షిదాబాద్, ధూలియన్ తదితర ప్రాంతాలను వదిలిపెట్టి భగీరథి నదిని దాటి పొరుగు జిల్లా మాల్దాకు పారిపోయినట్టు బెంగాల్ బీజేపీ చీఫ్ సువేందు అధికారి తెలిపారు. సీఎం మమతా బెనర్జీ బుజ్జగింపు రాజకీయాల కోసం కావాలనే బెంగాల్‌లో ఇస్లామిక్ ఉగ్రవాదం విస్తరించడానికి అవకాశం కల్పిస్తున్నారని ఆయన ఆరోపించారు. అల్లర్లు జరుగుతున్న ప్రాంతాలను సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం కింద కల్లోలిత ఏరియాలుగా ప్రకటించాలంటూ కేంద్రానికి బీజేపీ ఎంపీ జ్యోతిర్మయి సింగ్ లేఖ రాశారు.

## వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా భారీ నిరసన

**అంబేడ్కర్ విగ్రహం వద్ద ముస్లింల దీక్ష**
**హాజరై సంఘీభావం తెలిపిన టీపీసీసీ చీఫ్**
**బషీర్‌బాగ్‌లో ముస్లింల ర్యాలీ**
**19న భారీ నిరసన సభ: అసదుద్దీన్ ఒవైసీ**



**హైదరాబాద్, ఏప్రిల్ 13 :** వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం హైదరాబాద్‌లో ముస్లింలు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం రాజ్యాంగ వ్యతిరేకమంటూ ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. అలాగే లిబర్టీ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నిరసన దీక్షకు టీపీసీసీ అధ్యక్షుడు మహేషకుమార్ గౌడ్ సంఘీభావం హాజరై సంఘీభావం తెలిపారు. ఎంపీ ఇమ్రాన్ మసూద్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, టీజీఎంఆర్ఈఐఎస్ చైర్మన్ ఫహీం ఖురేషి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ ఖుస్రూ పాషా, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, షేక్ అక్బర్, ఉస్మాన్ హల్ అజ్రీ తదితరులు పాల్గొన్నారు. వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలకు తీవ్ర నష్టం జరుగుతుందని, దాన్ని రద్దు చేయాలని మాజీ ఎంపీ వీ హనుమంతరావు డిమాండ్ చేశారు. కాగా, వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 19న సాయంత్రం ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో దారుల్‌సలాంలో భారీ నిరసన సభ నిర్వహించనున్నట్లు మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోర్డు అధ్యక్షుడు ఖలీద్ సైఫుల్లా రెహ్మానీ అధ్యక్షతన జరిగే సభలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముస్లిం మత నాయకులు, ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. వక్ఫ్ ఆస్తుల రక్షణ పేరుతో చేసిన చట్టం వక్ఫ్ విలువైన ఆస్తులను ఇతరులకు ధారాదత్తం చేసేలా ఉందని విమర్శించారు. టీటీడీలో హిందువులు తప్ప ఇతర మతస్థులు ఉండరాదని తొలగిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు.. ముస్లింలకు సంబంధించిన ధార్మిక సంస్థలో ఇతర మతస్థులను సభ్యులుగా చేర్చే వక్ఫ్ సవరణ చట్టానికి ఎలా మద్దతు పలుకుతారని ఒవైసీ ప్రశ్నించారు. చంద్రబాబు, నితీశ్ తదితరులు ఈ చట్టానికి మద్దతు ప్రకటించి ముస్లింలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.

## రాష్ట్రంలో ఎవరూ సంతోషంగా లేరు



**అసంబద్ధ హామీలతో సంక్షోభంలో ప్రజల జీవితాలు**
**మోసకారి కాంగ్రెస్‌ను నమ్మితే రోల్డ్ గోల్డ్ కూడా రాదు**
**తెలంగాణపై కేసీఆర్‌కు ఉండే ప్రేమ ఢిల్లీ పార్టీలకు లేదు**
**ఇక ఎన్నిక ఏదైనా ఆ పార్టీలకు కర్రుకాల్చి వాత పెట్టాలె**
**మల్కాజిగిరిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
**ఎండను సైతం లెక్క చేయకుండా తరలివచ్చిన శ్రేణులు**
**కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు నేతలు**

**మేడ్చల్, ఏప్రిల్ 13 :** రేవంత్‌రెడ్డిలాంటి మోసపూరిత వ్యక్తిని నమ్మి తెలంగాణ రాష్ట్రం ఆగమైందని, రేవంత్‌లాంటి వారిని నమ్మితే ప్రజలకు గోల్డ్ కాదు కదా.. రోల్డ్ గోల్డ్ కూడా రాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ చెప్పిన అవాస్తవ వాగ్దానాలు, కాంగ్రెస్ ఇచ్చిన అసంబద్ధ హామీలతో ప్రజల జీవితాలు సంక్షోభంలో పడ్డాయని వాపోయారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మల్కాజిగిరిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సభలో కేటీఆర్ మాట్లాడారు. రెండు ఢిల్లీ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ వైఖరి ఒక్కటేనని, ఆ పార్టీలకు కావాల్సింది ఢిల్లీకి మూటలు పంపేవాళ్లే తప్ప తెలంగాణ ప్రజలు కాదని విమర్శించారు. 'మన ప్రజలకు నష్టం కలిగినా సరే.. ఢిల్లీకి మూటలు పంపి సీట్లు కాపాడుకునేటోళ్లే ఆ రెండు పార్టీలకు కావాలె' అని ఎద్దేవాచేశారు. 'ఎన్నికల ముందు ప్రజలకు కాంగ్రెస్ నాయకులు ఆశ చూపిండ్రు. కల్యాణలక్ష్మి కింద కేసీఆర్ రూ.లక్ష ఇస్తే దానికి తులం బంగారం కలిపి ఇస్తామని చెప్పిండ్రు. మేం రూ.10 వేల రైతుబంధు ఇస్తే వారు 15 వేలు ఇస్తమన్నరు. రెండు వేల పింఛన్‌ను నాలుగు వేలు చేస్తమన్నరు. ఇట్ల వాళ్లు చెప్పిన మయామాటలు నమ్మి ఇవాళ రాష్ట్రం మెంత్తం బాధ పడుతున్న పరిస్థితి ఉన్నది' అంటూ దుయ్యబట్టారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి తప్ప ఎవరూ సంతోషంగా లేరని, చివరికి ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా బాధపడుతున్నారని చెప్పారు. 'ఒక్కసారి మోసపోతే అది మోసగాడి తప్పు.. కానీ పదేపదే మోసపోతే అది ప్రజల తప్పు.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలవుతున్నా హైదరాబాద్‌లో ఒక్క అభివృద్ధి పనిని కూడా మొదలు పెట్టలేదు. తెలంగాణపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమ ఢిల్లీ పార్టీలకు ఉంటదా? ఎట్లుండె తెలంగాణ ఎట్లయిందో ఒక్కసారి ఆలోచించాలె. జీహెచ్ఎంసీ ఎన్నికలే కాదు.. ఎమ్మెల్యే, ఎంపీ.. రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా తెలంగాణకు శ్రీరామ రక్షలాంటి కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచేందుకు ఏకోన్ముకంగా కదలాలె' అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్, బీజేపీలకు కర్రుకాల్చి వాత పెట్టాలని సూచించారు.

**భరోసా ఇచ్చే పార్టీ బీఆర్ఎస్ ఒక్కటే..**


ఒక పార్టీగా బీఆర్ఎస్ 25 ఏండ్ల ప్రయాణంలో దాటిన మైలురాళ్లు ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకు తెలుసునని, తెలుగు రాష్ట్రాల్లో విజయవంతంగా నిలదొక్కుకున్న రెండో పార్టీగా బీఆర్ఎస్ ఘనత సాధించిందని కేటీఆర్ వివరించారు. నాడు దివంగత నేత ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ తెలుగుదేశం ఒకటైతే , తెలంగాణ ఆత్మగౌరవ బావుటాను హిమాలయాల ఎత్తుకు తీసుకెళ్లి, రాష్ట్రాన్ని సాధించి, అందరి కలను నెరవేర్చిన కేసీఆర్ నాయకత్వంలోని ఏర్పడిన బీఆర్ఎస్ రెండో పార్టీ అని చెప్పారు. తెలంగాణ ఆత్మను, తెలంగాణ స్వాభిమానాన్ని కాపాడే, నలుగురికి భరోసా కలిగించే పార్టీ బీఆర్ఎస్ ఒక్కటేనని స్పష్టంచేశారు. ఎండను సైతం లెక్కచేయకుండా సభకు వచ్చిన ఆడబిడ్డలకు, పార్టీ శ్రేణులకు, ప్రజలకు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

**మల్కాజిగిరి గులాబీమయం**

బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సభ సందర్భంగా మల్కాజిగిరి మొత్తం గులాబీమయమైంది. కేటీఆర్‌కు మల్కాజిగిరి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎర్రటి ఎండను లెక్క చేయకుండా భారీ సంఖ్యలో తరలివచ్చి అపూర్వ స్వాగతం పలికారు. ఆనంద్‌బాగ్ చౌరస్తా నుంచి సభా ప్రాంగణం వరకు కేటీఆర్‌ను భారీ ర్యాలీతో తోడ్కొని వచ్చారు. కేటీఆర్‌తో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ ఉన్నారు. కేటీఆర్ సమక్షంలో మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వందలాది మంది బీఆర్ఎస్‌లో చేరారు. వీరిలో వివిధ పార్టీల నుంచి హేమంత్ పటేల్, అర్వింద్, బంటి వందలాది మంది కార్యకర్తలు ఉన్నారు. మంచి నాయకుడిని ఎన్నుకుంటే ప్రజలకు మంచి జరుగుతుందనేందుకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డే నిదర్శనమని, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాజశేఖర్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేస్తున్నారని కేటీఆర్ ప్రశంసించారు.

## బిల్డర్ల సమస్యలను పరిష్కరిస్తాం

**పెట్టుబడులకు కేంద్రంగా హైదరాబాద్**
**సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ వేడుకలో మంత్రి ఉత్తమ్**
**గత ఏడాది హైదరాబాద్‌లో ఆస్తుల రిజిస్ట్రేషన్లు పెరిగాయ్: సీబీఏ**



**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 :** స్కిల్స్ యూనివర్సిటీ, ఫ్యూచర్ సిటీతో తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు హైదరాబాద్ కేంద్రంగా నిలుస్తోందన్నారు. ఆదివారం హెచ్ఐసీసీలో జరిగిన సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ (సీబీఏ) వార్షిక వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. అమెజాన్, గూగుల్ వంటి ప్రముఖ కంపెనీలు కొత్త శాఖలు ఏర్పాటు చేయడంతో పాటు హైదరాబాద్‌లోని పాత కార్యాలయాలను విస్తరిస్తున్నాయని చెప్పారు. తమ ప్రభుత్వం భవన నిర్మాణ రంగాన్ని ప్రోత్సహి స్తుందన్నారు. సైబరాబాద్, హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ అన్ని రంగాల్లో ప్రపంచస్థాయి నగరాలతో పోటీపడుతోందన్నారు. మహానగరంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా గోదావరి, కృష్ణా నుంచి మంచినీటి ని సరఫరా చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యను తగ్గించే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. బిల్డర్ల సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఏ సమస్యలున్నాలిఖిత పూర్వకంగా తెలియజేస్తే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సీబీఏ అధ్యక్షుడు ఉదయ్ శేఖర్ మాట్లాడుతూ.. రీజనల్ రింగ్ రోడ్డుతో పాటు మెట్రో విస్తరణకు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. సీబీఏ కార్యదర్శి జి.అరవింద్ ఘోష్ మాట్లాడుతూ.. 2023తో పోలిస్తే గత ఏడాది హైదరాబాద్‌లో ఆస్తుల రిజిస్ట్రేషన్లు పెరిగాయన్నారు. గత ఐదేళ్లలో నగరంలో ఆఫీస్ స్పేస్ లావాదేవీలు పెరిగాయని చెప్పారు. కొత్తపేట, నల్లగండ్ల, కొంపల్లి వంటి చోట్ల బలమైన లీజింగ్ లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రీ లాంచ్‌ను ప్రోత్సహించవద్దన్నారు. ఆ పేర్లతో జరిగే మోసాలపై కొనుగోలుదారులకు సీబీఏ అవ గాహన కల్పిస్తుందని చెప్పారు.

# జాకీలు పెట్టినా కాంగ్రెస్ లేవదు

**తక్కువ సమయంలోనే రేవంత్ సర్కారు గ్రాఫ్ డౌన్**

**పేదలకు నాణ్యమైన బియ్యం ఇవ్వాలి**

**చెట్ల నరికివేత విషయంలో సామాన్యుడికో న్యాయం రేవంత్‌డ్డికో న్యాయమా?**

**యంగ్ ఇండియా స్కూల్ ఫీజు రూ.1.5 లక్షలా?**

**గజ్వేల్ బీఆర్ఎస్ సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు**



**గజ్వేల్, ఏప్రిల్ 13:** అన్నీ అబద్ధాలే చెప్తున్న రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారని, జాకీలు పెట్టినా లేవలేని స్థితికి కాంగ్రెస్ పార్టీ చేరిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే తమ పని అయిపోయిందని చెప్పారని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ తక్కువ సమయంలోనే స్పీడ్‌గా పడిపోయిందని చెప్పారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు పెట్టినా బీఆర్ఎస్సే అధికారంలో వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. దేవుళ్ల మీద ఒట్టేసి దేశంలోనే మాట తప్పిన ముఖ్యమంత్రి.. రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా స్కూల్స్‌లో రూ.1.5 లక్షల ఫీజు చెల్లించాలని, కానీ, కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వమే ఒక్కో విద్యార్థిపై రూ.1.2 లక్షలు ఖర్చు పెట్టి నాణ్యమైన విద్యను అందించిందని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో ఉచితంగా విద్యను అందిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి ఫీజులు వసూలు చేస్తున్నదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఓట్ ఫర్ నోట్, చెట్ల నరికివేత, అబద్ధాలు, బూతులు మాట్లాడటం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎగ్గొట్టడంలో బ్రాండ్ అంబాసిడర్ అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆయన బ్రాండ్‌ను ప్రజలే నిర్ణయించాలని కోరారు.

**సామాన్యుడికో న్యాయం రేవంత్‌రెడ్డికో న్యాయమా?**

సొంత పొలంలో పెంచుకున్న చెట్టును నరికితేనే జరిమానాలు వేస్తారని, అదే రేవంత్‌రెడ్డి మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా వందలాది ఎకరాల్లో పచ్చని చెట్లను నరికించారని, ఇక్కడ సామాన్యుడికో న్యాయం, రేవంత్‌రెడ్డికో న్యాయమా? అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రామగుండంలో మూడు వేల ఎకరాల్లో, అగ్రికల్చర్ యూనివర్సిటీలో వంద ఎకరాల్లో, హెచ్‌సీయూలో 400 ఎకరాల్లో పచ్చనిచెట్లను నరికితే అధికారులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో మొక్కలు పెంచితే, రేవంత్‌రెడ్డి పాలనలో వాటిని నరికేస్తున్నారని విమర్శించారు. హెచ్‌సీయూకు సంబంధించిన 400 ఎకరాలను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు బాండ్ రూపంలో తెచ్చారని, రూ.170 కోట్లు బ్రోకర్ ఫీజు చెల్లించారని దుయ్యబట్టారు. 'భూమిని తాకట్టు పెట్టింది నిజం.. అప్పు తెచ్చింది నిజం.. ఇది నిజం కాదని నిరూపిస్తారా?' అని హరీశ్‌రావు సవాల్ చేశారు. దీనిపై సూటిగా, సీదా సీదాగా దమ్ముంటే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాదాసు శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, రాష్ట్ర నాయకులు దేవీరవీందర్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్ఎల్‌బీసీ ఘటనపై విచారణ చేపట్టాలి**

ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగి 50 రోజులు దాటినా సహాయక చర్యల్లో పురోగతి లేకపోవడం విచారకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులను కాపాడటంలో రేవంత్ సర్కారు విఫలమైందని ఆదివారం ఎక్స్ వేదికగా విమర్శించారు. ఈ ఘటనపై వెంటనే విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా కార్మికులు క్షేమంగా వస్తారని యావత్ దేశం ఎదురుచూస్తుంటే, సర్కారు మాత్రం ఇద్దరి మృతదేహాలను వెలికితీసి చేతులు దులుపుకొన్నదని దుయ్యబట్టారు. ఒక్కసారి ఘటనాస్థలికి వెళ్లొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కనీసం ఒక్కసారైనా సమీక్ష చేయకుండా నిర్లిప్త వైఖరిని ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. 'హెలిక్యాప్టర్‌లో వెళ్లిన మంత్రులు హడావుడి చేయడమే తప్ప సాధించిందేమీలేదు.. వారు పెట్టిన తేదీలు మారాయి తప్ప ఏ ఒక్కరినీ ప్రాణాలతో బయటకు తెచ్చిందిలేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటి కోసం, కూలి కోసం తెలంగాణకు వచ్చి ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు అండగా నిలువాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**సన్నబియ్యంలో సగం నూకలే**

పేదలకు పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలో సగానికిపైగా నూకలే ఉన్నాయని హరీశ్‌రావు మండిపడ్డారు. అందులో పాలిష్, ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయని, వండితే అన్నం బుజబుజ అవుతున్నదని, తినే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పేదలకు నాణ్యమైన సన్నబియ్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం గురుకుల పాఠశాలకు నూకలు లేకుండా క్వింటాల్‌కు రూ.350 చొప్పున చెల్లించి ఫైన్‌రైస్ ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేవిధంగా రూ.350 చొప్పున మిల్లర్లకు చెల్లించి కడుపునిండా అన్నం తినేవిధంగా సన్నబియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్.. నూకలు బుక్కండి అంటూ తెలంగాణ ప్రజలను హేళన చేశారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా సన్నబియ్యం పేరుతో పేదలకు నూకలే పంపుతున్నారని మండిపడ్డారు. రెండు విడతలుగా వానకాలంలో రూ.9 వేల కోట్లు, యాసంగిలో రూ.5 వేల కోట్లు కలిపి రేవంత్ సర్కారు రూ.14 వేల కోట్ల రైతుబంధు ఎగ్గొట్టిందని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారు కానీ, రైతులకు మాత్రం రైతుబంధు ఇవ్వడం లేదని దుయ్యబట్టారు.



# గడువు వద్దు

**బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు సమయం నిర్దేశించడాన్ని పునఃపరిశీలించాలి**

**సుప్రీంలో రివ్యూ పిటిషన్ వేయనున్న కేంద్రం**

**కేంద్రం లేవనెత్తిన పలు అంశాలను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదంటున్న అధికారులు**

**సాంకేతికంగా రద్దయిన బిల్లులకు ఈ తీర్పు ప్రాణం పోసేలా ఉందని వెల్లడి**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు సుప్రీంకోర్టు గడువు నిర్దేశించడంపై రివ్యూ పిటిషన్ వేసేందుకు కేంద్ర హోంశాఖ సిద్ధమైంది. తీర్పును పునఃపరిశీలించాలని జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్ ధర్మాసనాన్ని కోరనుంది. కేంద్రం లేవనెత్తిన పలు అంశాలు సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా సరిగా ప్రస్తావనకు రాలేదని, వాటిని పరిగణనలోకి తీసుకుని సుప్రీం తీర్పును పునః పరిశీలించాల్సి ఉంటుందని సీనియర్ అధికారులు తెలిపారు. ఈ మేరకు పిటిషన్‌ను సిద్ధం చేసే ప్రక్రియ మొదలైందని వెల్లడించారు. రాష్ట్రాల చట్టాలకు రాష్ట్రపతి ఆమోదం, ఇతర నిర్ణయాలకు సంబంధించి కేంద్ర హోంశాఖ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. సుప్రీంకోర్టు తీర్పు ఈ అంశానికే సంబంధించినది కావడంతో రివ్యూ పిటిషన్ వేసేందుకు కేంద్ర హోంశాఖ సిద్ధమైంది.

**రద్దయిన బిల్లులకూ ప్రాణం పోసేలా..!**

అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదించకుండా తొక్కిపెడుతున్నారంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా... గరిష్ఠంగా 3నెలల్లో నిర్ణయం తెలపాలంటూ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో గవర్నర్లు పరిశీలన కోసం పంపిన రాష్ట్రాల బిల్లులపై రాష్ట్రపతి కూడా మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. అయితే సుప్రీంలో వాదనల సందర్భంగా కేంద్రం లేవనెత్తిన పలు అంశాలు సరిగా ప్రస్తావనకు రాలేదని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రద్దయిన (ల్యాప్స్ అయిన) బిల్లులకు తిరిగి ప్రాణం పోసేలా ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం ఏదైనా బిల్లును గవర్నర్ తిప్పిపంపినా, రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకుండా ఆపేసినా.. ఆ బిల్లు రద్దయినట్టేనని తెలిపారు. సదరు బిల్లును యథాతథంగా గానీ, మార్పులు చేసిగానీ తిరిగి శాసనసభలో ఆమోదించాల్సిందేనని స్పష్టం చేశారు. కానీ తమిళనాడు గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఆపేసిన బిల్లులు ఆమోదం పొందినట్టుగానే భావించాలంటూ తీర్పు ఇచ్చిన ధర్మాసనం.. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదని వివరించారు. సాంకేతికంగా రద్దయిన బిల్లులకు తిరిగి ప్రాణం పోసేలా ఆ తీర్పు ఉందని వివరించారు. రాష్ట్రపతికి అందిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలంటూ కేంద్ర హోంశాఖ 2016లో ఇచ్చిన ఆఫీస్ మెమొరాండం ఆధారంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, కానీ ఇలా గడువు నిర్దేశించడాన్ని పునః పరిశీలించాలని పేర్కొన్నారు.

**మరో వివాదంలో తమిళనాడు గవర్నర్**

తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి మరో వివాదంలో చిక్కుకున్నారు. మదురై జిల్లా త్యాగరాజన్ ఇంజనీరింగ్ కాలేజీలో కంబ రామాయణంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని, జైశ్రీరామ్ అంటూ నినాదం చేసి, విద్యార్థుల చేత కూడా ఆ నినాదాలు చేయించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండే గవర్నర్ ఒక మతానికి చెందిన నినాదాలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

పీఎంఎల్ఏ పరిధిలోకి ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు!

డ్రీమ్11, గేమ్స్24%ఇ%7, వింజో వంటి ఆన్‌లైన్ రియల్-మనీ గేమింగ్ కంపెనీలను మనీలాండరింగ్ నిరోధక చట్టాల (పీఎంఎల్ఏ) పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కసరత్తు తుదిదశకు చేరుకుంది. ఈ కంపెనీలకు తప్పనిసరిగా కేవైసీ వంటి వాటిని వర్తింపచేయడంతో పాటు అనుమానాస్పద లావాదేవీలను ట్రాక్ చేసి, నిఘా ఉంచేలా కేంద్రం దృష్టిసారిస్తోంది. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలను 'ఆర్థిక నివేదికలను లిఖితపూర్వకంగా నివేదించాల్సిన సంస్థలు'గా కేంద్రం పేర్కొంది.

# హైవేల బలోపేతానికి 10 లక్షల కోట్లు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల బలోపేతానికి వచ్చే రెండేళ్లలో రూ.10 లక్షల విలువైన ప్రాజెక్టులు చేపడతామని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈశాన్య రాష్ట్రాలు, సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. రానున్న రెండు సంవత్సరాల్లో ఈశాన్యంలోని రోడ్లు అమెరికాతో సమానంగా ఉంటాయన్నారు. ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో గడ్కరీ మాట్లాడుతూ.. తూర్పు రాష్ట్రాల్లో రూ.3.73 లక్షల కోట్ల అంచనాతో 21,355 కిలోమీటర్ల మేర 784 హైవే ప్రాజెక్టులు చేపట్టనున్నామని తెలిపారు. వాటిల్లో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, ఎన్‌హెచ్ఏఐ, ఎన్‌హెచ్ఐడీసీఎల్ ప్రాజెక్టులు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే అసోం, బిహార్ తదితర రాష్ట్రాల్లో రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ నోటీసులు 'ప్రజాస్వామ్యంపై దాడి': సిబల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో స్థిరాస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ ఆదివారం తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ను బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు ఏజెన్సీలను వినియోగిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ కేసులో ఈడీ నోటీసులు జారీ చేయడాన్ని ఆయన 'ప్రజాస్వామ్యంపై దాడి'గా అభివర్ణించారు. హిందూ-ముస్లిం అజెండాపై బీజేపీ రాజకీయాలు చేయాలనుకుంటోందని, విపక్షాన్ని అంతమొందించాలనుకుంటోందని మీడియా సమావేశంలో ఆయన మండిపడ్డారు. వార్తాపత్రికకు సంబంధించిన భవనాల్లో కాంగ్రెస్ కార్యాలయాలు నడుస్తున్నందున వాటిని స్వాధీన పరచుకుని పార్టీ పని చేయకుండా చేసేందుకు నోటీసులు జారీ చేసినట్టు ఆయన చెప్పారు. అయితే 13 ఏళ్లు ఎందుకు వేచి చూశారని ఆయన నిలదీశారు.



# యాదగిరికొండపై భక్తుల సందడి

**నిత్యాదాయం రూ.54.91 లక్షలు**

**యాదగిరిగుట్ట, ఏప్రిల్ 13 :** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో కొండపై సందడి నెలకొంది. శని, ఆదివారం వారాంతపు సెలవు, సోమవారం (అంబేద్కర్ జయంతి) వరుసగా మూడు సెలవు రోజులు రావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. కొండకింద పార్కింగ్ ప్రదేశం వాహనాలతో నిండిపోయి వైకుంఠ ద్వారం ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేశారు. ఉభయ (ప్రత్యేక, ధర్మదర్శన) క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రద్దీగా ఉన్నాయి. వీఐపీ టికెట్ దర్శనానికి గంటన్నర, ధర్మదర్శనానికి రెండు గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. మధ్యాహ్నం గంటసేపు ఆరగింపు సమ యంలో క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. ప్రధానాలయం, ఉత్తర ప్రాకార మండపం, కొండకింద వ్రత మండపాలు, లక్ష్మీ పుష్కరిణి, అన్నప్రసాద సత్రం, బస్టాండ్, కొండపైన తిరువీధులు, బస్టాండ్, ప్రసా ద విక్రయశాలల్లో కూడా భక్తుల సందడి నెలకొంది. వేసవి తాపానికి తట్టుకోలేక కొండబండపై భక్తులు పరుగులు పెట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.54,91,048ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

**లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు**

సుప్రభాత సేవతోస్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు సంప్రదాయరీతిలో నిత్యపూజలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అనుబంధ ఆలయమైన పాతగుట్టలోనూ స్వామి, అమ్మవార్లకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాల యంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆయన ద్వారబంధనం చేశారు.

# భారత్ అమ్ముల పొదిలో లేజర్ అస్త్రం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** భారత్ అమ్ముల పొదిలో అధునాతన ఫ్యూచరిస్టిక్ 'స్టార్ వార్స్'గా పేర్కొంటున్న లేజర్ అస్త్రాలు త్వరలోనే చేరనున్నాయి. లేజర్ పుంజాలతో శత్రువుల డ్రోన్లు, క్షిపణులను విధ్వంసం చేయగల లేజర్ డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్(డీఈడబ్ల్యూ) ఎంకే-2(ఏ)ను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) తొలిసారి ప్రయోగాత్మకంగా పరీక్షించి.. విజయం సాధించింది. ఏపీలోని కర్నూలులో ఉన్న నేషనల్ ఓపెన్ ఎయిర్ రేంజ్‌లో ఆదివారం.. ఎంకే-2(ఏ)ను వినియోగించి లేజర్ పుంజాలతో డ్రోన్ల సమూహాలను, ఫిక్స్‌డ్ వింగ్ యూఏవీలను ధ్వంసం చేసింది. ఈ లేజర్ పుంజాలు అత్యంత శక్తిమంతమైనవని, ఎలాంటి లక్షిత డ్రోన్స్‌నైనా ధ్వంసం చేస్తాయని డీఆర్‌డీవో తెలిపింది. ఈ అధునాతన వ్యవస్థ భారత సైనిక దళాలకు 'గేమ్ చేంజర్'గా మారనుందని పేర్కొంది. ప్రస్తుతం ఉక్రెయిన్-రష్యా మధ్య జరుగుతున్న యుద్ధంలో డ్రోన్లను ఎక్కువగా వినియోగిస్తున్న నేపథ్యంలో డీఆర్‌డీవో కూడా ఆ దిశగా అడుగులు వేసి విజయం సాధించింది. "కర్నూలులో నిర్వహించిన వెహికల్ మౌంటెండ్ లేజర్ ఎనర్జీ డైరెక్టెడ్ వెపన్(డీఈడబ్ల్యూ) ల్యాండ్ వెర్షన్ ప్రయోగం విజయవంతం అయింది.

# సామాన్యులకు అందుబాటులో కైనెటిక్ గ్రీన్ ఈ వెహికల్స్



**తిమ్మాపూర్, జనతా న్యూస్ :** సామాన్యులకు, చిరు వ్యాపారులకు అందుబాటులో ఉండేలా కైనెటిక్ గ్రీన్ కంపెనీ ఎలక్ట్రిక్ వెహికల్స్ ని మార్కెట్లోకి తీసుకొచ్చిందని కంపెనీ సీఈఓ సంజయ్ బజాజ్ తెలిపారు. అలుగునూర్లో కైనెటిక్ గ్రీన్ ఈ బైక్ షో రూమ్ ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ రైతులకు గ్రామాల్లో తిరిగే చిరు వ్యాపారులకు అందుబాటులో ఉండేలా తక్కువ ధరకు ఎక్కువ కిలోమీటర్లు వెళ్లేలా తమ కనెటిక్స్ లునాలు, స్కూటీలు మార్కెట్లోకి తీసుకొచ్చినట్లు చెప్పారు . ఒక్కసారి ఫుల్ ఛార్జింగ్ చేస్తే 125 కిలోమీటర్ల వరకు తమ ఈ బైక్ వెళ్తుందని. తమ కంపెనీలో ప్రవేశపెట్టిన లూనా ను మూడేళ్ల తర్వాత తిరిగి ఇస్తే సగం డబ్బులు వాపస్ ఇవ్వబడుతుందని అన్నారు. అంత నమ్మకంతో తమ వాహనాలు మార్కెట్లోకి తీసుకొచినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా ఎప్పుడైనా వచ్చి వాహనాలను టెస్ట్ రైడ్ చేసి తీసుకోవచ్చని సూచించారు. కైనెటిక్ గ్రీన్ కంపెనీ ద్వారా నాణ్యత, మన్నిక, పనితీరులో పూర్తి భరోసా వాహనదారునికి ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రామ్ బజాజ్, రాహుల్ బజాజ్, శ్యామ్ బజాజ్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ పోస్టల్ యూనియన్ల నూతన కార్యవర్గం ఎన్నిక

## ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం : పసుల శ్రవణ్



కరీంనగర్, జనతా న్యూస్: భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గ్రూప్ మరియు పోస్ట్‌మాన్ %ంౌ% ఎమ్.టి.ఎస్ విభాగాలకు సంబంధించిన భారతీయ మ-జ్దూర్ సంఘ్ అనుబంధ యూనియన్ల నూతన కార్యవర్గాన్ని కరీంనగర్ ప్రధాన పోస్టాఫీస్ లో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ల నుండి ఉద్యోగులు బిఎంఎస్ అనుబంధ యూనియన్లో చేరారు. ఈ సందర్భంగా బిఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి బిఎంఎస్ విశ్వసనీయ వేదికగా నిలుస్తుందన్నారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా, నిరంతరం అందుబాటులో ఉంటూ సహాయంగా ఉంటామని తెలిపారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రతి ఉద్యోగి తన పనిని నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోస్టల్ సూపర్వైజర్ అసోసియేషన్ %==% కార్యదర్శి కె.వి. పవన్‌కుమార్ హాజరై, బీఎంఎస్ లో చేరడం ఉద్యోగుల భవిష్యత్‌కు దోహదపడుతుందని, సంఘ బలమే హక్కుల సాధనకు మార్గమని హితబోధ చేశారు. ఉద్యోగులు ఐక్యంగా నిలబడితే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ఆయన సూచించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. భారతీయ పోస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గ్రూప్ %జ% డివిజన్ అధ్యక్షునిగా పంగ అంజయ్య, ఉపాధ్యక్షునిగా బైరి ప్రదీప్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా సకినాల అనిల్‌కుమార్, కార్యదర్శిగా నాగుల ఆంజనేయులు, సహాయ కార్యదర్శులుగా పి రమేష్, రాజమల్లు , సంఘటన కార్యదర్శిగా జంపాల సాయిక్రిష్ణ మరియు భారతీయ పోస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ - పోస్ట్ మాన్ %ంౌ% ఎమ్ టి ఎస్ కరీంనగర్ డివిజన్ అధ్యక్షునిగా దాడి మల్లేశం, కార్యనిర్వాహక అధ్యక్షునిగా మిట్టపల్లి సదయ్య, కార్యదర్శిగా ఓరుగంటి విష్ణువర్ధన్, సహాయ కార్యదర్శిగా చౌహన్ లఖన్, కోశాధికారిగా రేగుల రాజ్ కుమార్ లని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బి ఎం ఎస్ జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్ తెలిపారు

# టీవీ9 సీనియర్ కరస్పాండెంట్ గాండ్ల సంపత్ కు ఉగాది పురస్కారం..

కరీంనగర్, జనతా న్యూస్: తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఏటా ఇచ్చే ఉత్తమ జర్నలిస్ట్ ఉగాది పురస్కారానికి టీవీ9 కరీంనగర్ సీనియర్ కరస్పాండెంట్ జి. సంపత్ కుమార్ ఎంపికయ్యారు. నిరంతరం అలర్ట్ గా ఉంటూ, పారదర్శకమైన వార్తాప్రవంతితో ప్రజలకు, ప్రభుత్వానికీ మధ్య వారధిగా ఉంటూ కచ్చితమైన సమాచారాన్నందిస్తున్న సంపత్ కుమార్ గత 18 ఏళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారం ప్రకటించారు. 2024-25 సంవత్సరానికిగాను ఉత్తమ జర్నలిస్టుగా విజయవాడ వేదికగా పురస్కారాన్నీ సంపత్ కుమార్ కు ప్రకటించారు. శ్రేయోభిలాషులు, వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ సందర్భంగా సంపత్ కు అభినందనలు తెలిపారు.




# హక్కుల సాధనతోపాటు బాధ్యతలు నెరవేర్చాలి

## మానవ మేధస్సుకు పదును పెట్టాలి

## విద్యార్థులకు చదువే ఆయుధం

## సెమినార్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్, జనతా న్యూస్:** హక్కుల సాధనతో పాటు దేశ పౌరులుగా బాధ్యతను కూడా నెరవేర్చాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా శాతవాహన యూనివర్సిటీలో సమగ్రాభివృద్ధికి సంక్షేమ పథకాలు అనే అంశం పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. అందుకు చదువు అననే ఆయుధాన్ని స్వీకరించాలని తెలిపారు. దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయులంతా ఉన్నత విద్య అభ్యసించిన వారేనని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి హక్కులు గుర్తుంటాయని, ఆ హక్కుల సాధనకు పోరాడుతారని తెలిపారు. అదేవిధంగా దేశ పౌరుడుగా ప్రతి ఒక్కరూ తన బాధ్యతను కూడా నెరవేర్చాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిబాపూలే ఉన్నత చదువులు అభ్యసించి దేశ అభివృద్ధికి పునాదులు వేశారని తెలిపారు. దేశంలో నాటుకు పోయిన తరతరాల మూఢాచారాలను తొలగించారని అన్నారు. యువత వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెక్నాలజీని వినియోగించుకుంటూనే మానవమేధస్సుకు పదును పెట్టాలని సూచించారు. సమాజ సేవలో నేటి యువత తమ వంతు బాధ్యత నెరవేర్చాలన్నారు. నిత్యం పుస్తక పఠనం చేస్తూనే, వివిధ రంగాలలో నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులంతా మహనీయుల చరిత్రను తప్పక తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు మార్గాలను భవిష్యత్తు తరాలు అనుసరిస్తాయని విషయం గుర్తుంచుకోవాలని తెలిపారు. విశ్వవిద్యాలయంలో మహనీయుల జయంతిని ఒక ఉద్యమంలా చేస్తున్నామని, ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు గత చరిత్ర తెలుస్తుందని అన్నారు. మహనీయులు అందించిన ఫలాలను సద్వినియోగం చేసుకొని విద్యా ఉపాధి రంగాల్లో మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు.

గంగాధర ఎంపీడీవో దాముని రాము మాట్లాడుతూ దేశంలోని అసమానతలను,రుగ్మతలను రూపుమాపేందుకు, భావి భారత నిర్మాణానికి ప్రణాళికలు రచించిన సమతామూర్తులని ఎప్పటికీ మరువరాదని అన్నారు. మహిళ సాధికారతే దేశ అభివృద్ధిగా చెప్పిన మహనీయుల బాటలో నడవాలని సూచించారు. ఎస్ ఆర్ ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రగతి మార్గానికి దోహదపడే పథకాలు చాలా ఉన్నాయని వాటిని అమలు చేయడమే మహనీయులకు మనమిచ్చే గౌరవమని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి సెమినార్ కు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సెమినార్ లో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి, ఓ.ఎస్.డి డా. హరికాంత్, కన్వీనర్ డా.మనోహర్, ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, మైనారిటీ సెల్ సంచాలకులు డా.ఉమేరా తస్లీమ్, బీసీ సెల్ సంచాలకులు డాక్టర్ సరసిజా, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సూరేపల్లి సుజాత, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డా. జయంతి, పరీక్షల నియంత్రణ అధికారి అబ్రరూల్ బకి, ఆచార్య వరప్రసాద్, డా. రంగప్రసాద్, డా. శ్రీవాణి, డా. మునావర్, అధ్యాపకులు డా. జోసఫ్ డా. తిరుపతి, డా. విజయకుమార్, డా. రవికుమార్, డా. రాజు, డా. యశ్వంతరావు, డా. ప్రసాద్, హరికృష్ణ, నరసింహ చారి పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ సెస్ ఆద్వర్యంలో రైతు పొలం బాట కార్యక్రమం



వేములవాడ, జనతా న్యూస్: విద్యుత్ శాఖ సెస్ సిరిసిల్ల ఆద్వర్యంలో వేములవాడ అర్బన్ మండలం లోని మరుపాక గ్రామం లో ఆదివారం రైతు పొలం బాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో కొన్ని ముఖ్య అంశాల మీద రైతులకు అవగాహనా కల్పించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో ఏ ఏ ఓ జగదీష్ మరియు ఏ ఏ ఈ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తమ మోటార్లు ఐ ఎస్ ఐ కలిగిన నాణ్యమైన వి మాత్రమే వాడాలని,అలాగే ఇనుప డబ్బాల బదులు ప్లాస్టిక్ డబ్బాలను వాడవలెను , అలాగే కెపాసిటర్ వాడవలెను ఉరుములు మెరుపులు వచ్చేటప్పుడు వైర్ల కింద ఉండరాదని తగు జాగ్రత్తలు తెలియజేసినారు అని మరి అలాగే ఎక్కడైనా లూస్ లైన్, సపోర్ట్ వైర్ తెగి ప్రమాదకరంగా ఉన్నచో మాకు గాను మా సిబ్బంది గాని తెలియజేయాలనీ మాట్లాడారు , పొలం దగ్గరకి వెళ్లే క్రమంలో తగు జాగ్రత్తలు తీస్కొని విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు,

రైతులు సాంక్షన్ లో లేని బోర్ లేదా బావి కనెక్షన్లను వెంటనే ఆఫీసుకు వచ్చి సాంక్షన్ చేసుకోగలరు రైతులకు లో వాల్టేజ్ సమస్య ని నిర్మూలించడానికి అదనపు ట్రాన్స్ఫార్మర్ల కొరకు ప్రత్తిపాదనలు పంపడం జరిగిందని తెలిపినారు

అలాగే సెస్ సంస్థ నాణ్యమైన విద్యుత్ సరఫరా ఇస్తున్నదని ఇట్టి కరెంట్ ను రైతులందరు వాడుకోవాలి అని మరియు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి తొడపడాలని తెలియజేసినారు ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నచో తమ దృష్టి కి తీసుకొస్తే వెంటనే పరిస్కారం చేస్తామని మాట్లాడారు ఇట్టి కార్యక్రమం లో రైతులు మరియు విద్యుత్ సిబ్బంది గ్రామం పెద్దలు పాల్గొన్నారు

# హుజరాబాద్ లో కె ఆర్ ఎం పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం



హుజురాబాద్ ఏప్రిల్ 13 జనతా న్యూస్: హుజురాబాద్ పట్టణంలోని కేఆర్‌ఎం మల్టీ పర్పస్ పాఠశాలలో 2008-2009లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం బాల గార్డెన్ లో జరిగింది. ఈ ఆత్మీయ సమ్మేళనానికి అప్పటి స్కూల్ కరస్పాండెంట్ పోలంపల్లి ఆదర్శన్ రెడ్డి, ఉపాధ్యాయులు హాజరయ్యారు. నాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. నాడు ఉపాధ్యాయులు చూపిన శ్రద్ధతోనే, బోధనతోనే.. క్రమశిక్షణతో తాము జీవితాల్లో స్థిరపడినట్టు విద్యార్థులు తెలిపారు.

# ఎలుగుబంటి దాడిలో యువకుడికి గాయాలు



హుజురాబాద్ ఏప్రిల్ 13 జనతా న్యూస్ : హుజురాబాద్ మండలం కాట్రపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం ఎలుగుబంటి బాణాల హరీష్ అనే యువకుడి పై దాడి చేసింది. బహిర్భూమికి వెళ్తుండగా ఒకసారి ఎలుగుబంటి వెంటపడింది. ఎరుగుబంటి దాడిలో హరీష్ చేతికి భుజంపై గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో గత కొద్ది కాలంగా ఎలుగు బంట్లు తిరుగుతున్నాయని, అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకొని దక్షిణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

## నలుగురు మహిళలు దుర్మరణం

**ప్రజా దీవెన, హిందూపురం:** ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పరిగి మండలం ధనాపురం క్రాస్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు మృతి చెందగా 11 మం ది కి గాయాలయ్యాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రులను హిందూపురం ప్రభు త్వ ఆసుపత్రికి తరలించినట్లు పో లీసులు తెలిపారు. పోలీసుల కథ నం మేరకు రొద్దం మండలం దొడగ ట్ట గ్రామానికి చెందిన వారు ఆటో లో హిందూపురం సమీపంలోని కొ టిపి చౌడేశ్వరి దేవి ఆలయంను ద ర్శించుకుని తిరిగి వస్తున్న క్రమంలో పరిగి సమీపంలోని ధనాపురం క్రాస్ వద్ద ఆటోను గుర్తు తెలియని వా హనం ఢీకొని ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మరో మహిళ చికిత్స పొందుతూ కన్నుమూసింది.

మృతుల వివరాలు ఇలా ఉన్నా యి. సాకమ్మ, అలివేలమ్మ, ఆదిలక్ష్మమ్మవీరంతా ఒకే గ్రామం కు చెంది నవారు కాగా మరో 11 మందికి గా యాలైనట్లు సమాచారం. పూర్తి స మాచారం తెలియాల్సి వుంది. పరి గి పోలీసులు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపా రు.





# ఖాళీ కడుపుతో వర్కవుట్స్ చేస్తే..!

ఖాళీ కడుపుతో వర్కవుట్స్ చేస్తే, కడుపు దగ్గర పేరుకునే మొండి కొవ్వు కరుగుతుందనీ, త్వరగా బరువు తగ్గవచ్చని కొందరు అనుకుంటూ ఉంటారు. కానీ దీన్లో నిజమెంత?

ఖాళీ కడుపుతో చేసే వ్యాయామాన్ని ఫాస్టెడ్ కార్డియో అంటారు. ఇలా వ్యాయామం చేయడం వల్ల, శరీరం మనం తీసుకున్న ఆహారం నుంచి కాకుండా తనలో పేరుకుని ఉన్న కొవ్వు, కార్బొహైడ్రేట్ల నుంచి శక్తిని సంగ్రహిస్తుందని అనుకుంటాం. కానీ నిజానికి వ్యాయామానికి ముందు సరిపడా పోషకాలు తీసుకోవడం వల్ల సమర్థంగా వ్యాయామం చేయగలగడంతో పాటు కండర నష్టాన్ని అరికట్టగలుగుతాం. అలాగే వ్యాయామం చేయడానికి సరిపడా శక్తి సమకూరి అలసిపోకుండా ఉంటాం. కాబట్టి వ్యాయమానికి 45 నిమిషాల ముందు ఒక పండు లేదా స్నాక్ తీసుకోవడం తప్పనిసరి. మరీ ముఖ్యంగా 50 ఏళ్లు పైబడిన వాళ్లు తప్పనిసరిగా వ్యాయమానికి ముందు స్నాక్ తినాలి.

### ఎలాంటి ఆహారం?

బ్లాక్ కాఫీ లేదా ప్రి వర్కవుట్ కెఫిన్‌ను ప్రివర్కవుట్ డ్రింక్‌గా తీసుకోవచ్చు. కార్బ్స్ తినాలనుకుంటే యాపిల్ లేదా పాలతో పాటు ఒక అరటిపండు లేదంటే కొన్ని డ్రై ఫ్రూట్స్ తీసుకోవచ్చు. తినడానికి ఇష్టపడని వాళ్లు, గ్లూకోజ్, లేదా ఎలక్ట్రొలైట్స్ కలిగిన నీళ్లను వ్యాయామానికి ముందు, వ్యాయామం చేస్తున్నప్పుడు తాగుతూ ఉండాలి.

## ప్రొటీన్ ఎక్కువగా తీసుకుంటున్నారా..

# ఈ సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు

మనిషి ఆరోగ్యానికి ప్రొటీన్ ఎంతో మేలు చేస్తుంది. కానీ, మోతాదు మించితే రక్తంలో కలిసే ప్రొటీన్ విషంగా మారుతుంది. అందుకే మనిషి బరువును బట్టి అవసరమైన ప్రొటీన్ ను లెక్కగట్టి తీసుకోవాలంటున్నారు నిపుణులు. కిలో శరీరబరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ మాత్రమే అవసరం. కాబట్టి మీ బరువును బట్టి మీకెంత ప్రొటీన్ అవసరమో లెక్క వేసుకోవచ్చు. బరువు తగ్గేందుకు, కండరాల నిర్మాణానికి, కణాల రిపేర్ చేయడానికి ప్రొటీన్ చాలా అవసరం. అయితే ప్రొటీన్ అధికంగా ఆహారాన్ని అపరిమితంగా తింటే మాత్రం ఆరోగ్య సమస్యలు వస్తాయి.

### దాహం పెరుగుతుంది

శరీరంలో ప్రొటీన్ ఎక్కువైతే శరీరం నీరసించి పోతుంది. తీవ్రమైన దాహం కలుగుతుంది. ఎందుకంటే.. అధిక ప్రొటీన్ వల్ల శరీరానికి ఎక్కువ నీరు కావాల్సి వస్తుంది. దాని వల్ల విపరీతమైన దాహం వేస్తుంది. దీనికి కారణం ప్రొటీన్లో ఉండే నత్రజని. ఇది అధికంగా రక్తంలో చేరడం వల్ల ఇలాంటి మార్పులు కలుగుతాయి. దీని వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. వ్యర్థాలను బయటకు పంపేందుకు అధికంగా కష్టపడాల్సి వస్తుంది. ఎంత నీరు తాగిన శరీరానికి సరిపోదు. దీనివల్ల శరీరం బలహీనంగా మారిపోతుంది. తలనొప్పి ఎక్కువైపోతుంది. బరువు తగ్గి సన్నగా మారిపోతారు.

### నోటి దుర్వాసన దీని లక్షణమే..

చాలా మంది నోటి దుర్వాసనతో బాధపడుతుంటారు. ఇందుకు ఆహారంలో అధిక ప్రొటీన్ కూడా కారణమేనంటున్నారు. ప్రొటీన్లో ఉండే రెండు ఆమ్లాల తీవ్రమైన దుర్గంధాన్ని కలిగిస్తాయి. ఇందుకోసం కూడా అధికంగా నీళ్లు తాగాల్సి వస్తుంది.

### మలబద్ధకం

ప్రొటీన్ శరీరంలో అధికమైతే మలబద్ధకం సమస్య కూడా ఎక్కువవుతుంది. కార్బోహైడ్రేట్లు తగ్గి, ప్రొటీన్ పెరిగితే మాత్రం ఈ సమస్య మరీ తీవ్రంగా మారుతుంది.



ప్రొటీన్ ఉండే ఆహారం అధికంగా తిన్నామనిపిస్తే, కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారాన్ని అధికంగా తినాలి.

### ప్రొటీన్ అధికంగా ఉండే పదార్థాలు...

కొన్ని ఆహారాల్లో ప్రొటీన్ అధికంగా దొరుకుతుంది. మటన్, చికెన్, గుడ్లు , చేపలు, రొయ్యలు, పాలు, పెరుగు, చీజ్, నట్స్ (బాదం, జీడిపప్పు,వాల్నట్స్, గుమ్మడి గింజలు, నువ్వులు, సన్ ఫ్లవర్ గింజలు, టోఫు, అన్ని రకాల బీన్స్, శెనగలు... వీటన్నింటిలో ప్రొటీన్ ఉంటుంది.

### ఒంటి నొప్పులు..

ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీరంలో వేడిని కలిగిస్తాయి. ఉదాహరణకు చికెన్, గుడ్లు, రొయ్యలు వంటివి. వీటిని మోతాదుకు మించి తీస్కుంటే ఒంటి నొప్పులు వేధిస్తాయి.

# హిందూ మతోన్మాదానికి అంబేద్కర్ ఓ సవాల్

స్వాతంత్ర్య భారతదేశం అంబేద్కర్ 134వ జయంతి జరుపుకోవటానికి సిద్ధమవుతున్న సందర్భంలో ఒక పక్కపార్లమెంట్ సాక్షిగా జరిగిన ఘోర అవమానం.మరోపక్క ఆయన ఎన్నడూ లేనంత ఎత్తుకు ఎదిగినట్లు కనిపి స్తున్నది.అనేకముఖ్య ఘట్టాల్లో, ఉద్యమాల్లో నవభారత నిర్మాణం, ప్రజాస్వామ్యం, సామాజిక రుగ్మతలు లేని దేశం కోసం అంబేద్కర్ కృషి చేశారు. ఆయన జీవితానుభవంలో గుర్తించిన సామాజిక సమస్యలు, ఉద్యమాలు, అధ్యయనం, ఆలోచనలను ప్రయోగాత్మకంగా పరిశీలించాలి. భారత సమాజం గురించి ఆయన లోతుగా పరిశీలన చేసి లేవనెత్తిన అనేక ప్రశ్నలు నేటికీ సజీవంగా నిలిచి ఉండటం,ఆయన కృషిని,ప్రాధాన్యతని నేటికీ గుర్తు చేస్తున్నాయి.1871 ఏప్రిల్ 14వ తేదీన మధ్య భారతదేశంలో మౌ అనే ప్రాంతంలో, మత భావాలను విశ్వసించే,పేద మెహర్ కుటుంబంలో భీమ్ రావ్ అంబేద్కర్ జన్మించారు.పాఠశాల విద్యాభ్యాసం సతారాలోను, కళాశాల విద్యాభ్యాసం ముంబైలోను పూర్తిచేసిన అంబేద్కర్ 1913-17లో కొద్దికాలం పాటు బరోడా మహారాజు దగ్గర సేవలందించారు.లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ కొలంబియా విశ్వవిద్యాలయంలో, గ్రేస్ ఇన్ బాక్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య నభ్యసించిన ఈ నవయువకుడు ఆనాటి సమకాలీన రాజకీయ నాయకుల్లో చాలా మందికి లేనటువంటి, అమోఘమైన పాండిత్యాన్ని సంపాదించారు. సామాజిక అడ్డంకులు ముఖ్యంగా పక్షపాత వైఖరి, సామాజిక అణచివేతలు, కులపీడనలు వంటివి ఎదుర్కొని ఈ ఘనత సాధించారు.

1920లలో తొలినాళ్లకే అంబేద్కర్ ఎంఎ, పిహెచ్‌డి అర్థశాస్త్రంలో ఎమ్మెస్సీ,డి.ఎస్.సి, బారిస్టర్ ఎట్ లా పూర్తి చేశారు.తనకి ముప్పై ఏండ్లొచ్చేసరికే ప్రముఖ విద్యావేత్తలు, అధ్యయనకారులు తమ జీవితకాలంలో సాధించలేనన్ని నిజ జీవితఅనుభవాలను అంబేద్కర్ గడించారు. నాలుగు దశాబ్దాల తన ప్రజాజీవితంలో అనేక వివాదాస్పద అంశాలలోనూ, అధిగమించటానికి వీలు లేనటువంటి సామాజిక అంధకారంలో నుంచి వెలుతురులా ఉద్భవించారు. అలెగ్జాండర్ గోల్డెన్‌వైసర్ 1916మే నెలలో సామాజిక శాస్త్రాలపై సెమినార్ జరిపినప్పుడు, మొట్టమొదటి సారిగా అంబేద్కర్ భారతదేశంలో కులాల తీరు తెన్నులు, పుట్టుక, అభివృద్ధి అనే అంశంపై చాలా అద్భుతమైన పత్రాన్ని అందించారు. పారదర్శకత, నిజాయితీ, పట్టుదల వంటి అపూర్వగుణాలు కలిగిన ఉదారవాది డా.అంబేద్కర్. తాత్వికంగా మొదట ఆదర్శవాదం వైపు మొగ్గినప్పటికీ, అంతిమంగా బుద్ధుని సిద్ధాంతం వైపు ఆకర్షితుడయ్యారు. మార్క్సిజం పుస్తకాలను కూడా చాలా లోతుగా అధ్యయనం చేశారు. 1950లో ఆయన న్యాయశాఖ మంత్రిగా ఉండి హిందూ కోడ్ బిల్లు తెచ్చినప్పుడు, అదే జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన మంత్రిగా అంబేద్కర్‌ను దెబ్బతీశారు. అంబేద్కర్ జీవించినంత కాలం, ఆయన ప్రత్యర్థులు, విమర్శకులు మరీ ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు, ఆయన్ను ఆ యుగంలోని వ్యూహాత్మక లక్ష్యాన్ని గుర్తించలేని వ్యక్తిగా పదేపదే అభివర్ణించేవారు.ఆ ప్రచారం బాగా ప్రాచుర్యం పొంది, ఆఖరికి మీడియా కూడా ఆయన్ను ఒక రెండో తరగతి దేశనాయకుడిగా,షెడ్యూల్డ్ కులాలకే పరిమితమైన నాయకుడిగా చిత్రీకరించింది. వస్తుగతంగా చూస్తే ఆయనంత ఉన్నత వ్యక్తి, సాహసోపేతమైన దేశ నాయకులు చాలా తక్కువమంది ఉన్నారన్నది సుస్పష్టం.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నడిచిన స్వాతంత్ర్య పోరాటంలో దీనికి తగినంత ప్రాధాన్యత ఇవ్వబడలేదు. దేశ రాజకీయ దృక్పథంలో ఎప్పుడూ నికరంగా కేంద్ర స్థానం వహిస్తూ, తీవ్రవాద శైలితో, సామాజిక అంశాల్లో ఎటువంటి సర్దుబాటు ధోరణి ప్రదర్శించకుండా ఎన్నో ఉద్య మాలకు నాయకత్వం వహించారు అంబేద్కర్. సమాజంలోని అసమానతలు, మతాల్లో ఇమిడి ఉన్న అణచివేత ధోరణులు, సాంప్రదాయ వారసత్వాలు, మెజారిటీ సమాజం రుద్దిన విలువలను గమనించారు. అంబేద్కర్ రాజ్యాంగసభలో,రాజ్యాంగ ముసాయిదా రూపకల్పన కమిటీకి అధ్యక్షత వహించి,ప్రధాని నెహ్రూ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్‌లో కొంతకాలం ఉన్నప్పటికీ, భారత రాజకీయాల్లో కాంగ్రెసేతర, కాంగ్రెస్ వ్యతిరేక భావధారకు ఆయన్నే మనం ఆద్యుడిగా పరిగణించాలి.కానీ వాటికి భిన్నంగా హిందూ మితవాదం బాగా పైచేయి సాధించి,మెజారిటీ మతమౌఢ్యం, సామాజిక అభివృద్ధి నిరోధకత్వాలు సాగిస్తున్న రాజకీయ,సిద్ధాంత ఎదురుదాడి ప్రస్తుత దేశపరిస్థితికి అద్దం పడుతున్నాయి. అంబేద్కర్ వారసత్వాన్ని సొంతం చేసుకోవడానికి హిందూత్వవాదులు చరిత్రసారాన్ని వక్రీకరించి మరీ ప్రయత్నాలు సాగిస్తున్నారు.ఇటువంటి పరిస్థితుల్లో





కులవ్యవస్థపైనా,చాతుర్వర్ణ, సనాతన ధర్మాల పైనా ప్రతిఒక్కరూ పోరాడాలి. అంటరానితనాన్ని మార్పు లేకుండా యథాతథంగా నిలిపి ఉంచే సామాజిక దొంతరలపైనా హిందూ ధర్మశాస్త్రాల ఆధిపత్యం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలపై నేడు ఉద్యమించాలి. ప్లాటో రిపబ్లిక్ ఏ కారణం వల్ల వైఫల్యాన్ని ఎదుర్కొందో,సరిగ్గా అదే కారణం మూలంగానే చాతుర్వర్ణ వ్యవస్థ కూడా తప్పని సామాజిక తిరుగుబాటుదారుడైన,ఈ పీడిత వర్గ మేధావి హెచ్చరించారు.

ఈ దుర్మార్గ వ్యవస్థ మూలంగా హిందువుల్లో దిగువ వర్గాలు ప్రత్యక్షంగా కార్యాచరణలోకి దిగకుండా పూర్తిగా నిస్సహాయులుగా చేయబడ్డారని అంబేద్కర్ వేలెత్తి చూపి ఇంతకంటే నీచమైన సామాజిక వ్యవస్థ మరొకటి రాబోదని హెచ్చరించారు.ఈ వ్యవస్థ ప్రజలను పరస్పర సహాయ కార్యకలాపాలు చేయనివ్వకుండా కుంటుపరిచి,వారిని నిస్సహా యులుగా,చచ్చుబడిన వారిలా చేస్తుందని తెలిపారు.ఆయన సామాజిక, ఆర్థిక,ప్రజాస్వామ్యం కోసం ఉద్యమిస్తూనే ఈ వ్యవస్థ రాజకీయ రంగంలో కలగజేసే ప్రభావాలపై దృష్టి సారించి అవిరళమైన కృషి చేశారు. ధర్మశాస్త్రాలపై ఉన్న విశ్వాసాన్ని సర్వనాశనం చేయడం,వాటి పునాదిగా గల కులపరమైన నిరంకుశత్వాన్ని నాశనం చేయడమే దీనికి వాస్తవ పరిష్కారమని అంబేద్కర్ భావించారు.ఇటువంటి విషయాల్లో గాంధీ అర్ధ శతాబ్దానికి ముందే 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హిందూ మతానికి ఓసవాల్' అని ప్రకటించాడంటే అందులో ఆశ్చర్యమేమీలేదు. నిజంగానే ఆయన ఈనాటికీ ఒక సవాల్ గానే నిలిచి ఉన్నారు.అందువల్లనే హిందూత్వ వాదులు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూటమికి చెందిన కొన్ని శక్తులు నేడు ఆయనను నిర్లక్ష్యం చేయలేని స్థితిలో ఉన్నాయి. సామాజిక పురోగతిని నిరోధించటానికి పూనుకున్న వారిని వ్యతిరేకిస్తూ, సామాజిక ఛాందసవాదం, అవకాశవాద రాజకీయాలపై యుద్ధాలు సాగిస్తూ 1940 దశకం చివరిలో, 1950 దశకం తొలిలో హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టే ప్రయత్నాలకు నాయకత్వం వహించారు.కానీ ఛాందసవాద శక్తులు ఆయన ప్రయత్నానికి వెన్నుపోటు పొడిచాయి.

వారసత్వం, వంశపారంపర్య పాలననూ,ఏక పార్టీ వ్యవస్థను ఆయన ద్వేషించారు.ఒకే పార్టీ ప్రజామోదమైన ప్రభుత్వాన్ని నడపటం అంటే,నిరంకుశత్వం తెరవెనుక నుండి పాలన సాగించే ఒక రూపంగా ప్రజాస్వామ్యం తయారవ్వడాన్ని అనుమతించడమే అనేది అంబేద్కర్ ప్రముఖ సూత్రీకరణల్లో ఒకటి.నిరంకుశత్వం ఎన్నికయినదయినప్పటికీ, అది నిరంకుశత్వం కాకమానదు. నిరంకుశత్వం కూలదోయబడే అవకాశం ఉండటం,దాన్ని తోక ముడిచేటట్లు చేయగల అవకాశం ఉండటం,దాని ప్రత్యర్థి పార్టీ దాని స్థానంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉండటమే నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నిజమైన గ్యారంటీ అని అంబేద్కర్ హెచ్చరించారు. ఏకపార్టీ పాలన ప్రాతిపదికన గానీ,లేదా నిద్రపోయే హక్కులని నిద్రపోనీ అనే సామాజికతత్వ ప్రాతిపదికతో ఉండే రాజకీయ సుస్థిరత గానీ అంబేద్కర్‌కు గిట్టని విషయాలు. అంబేద్కర్ దూరదృష్టితో వెలిబుచ్చిన రాజకీయ భావాల్లో రెండు నేటి కాలానికి కూడా వర్తిస్తాయి.వాటిలో మొదటిది రాజకీయ స్వేచ్ఛలను ఒక గొప్ప వ్యక్తి పాదాల కింద ఉండనివ్వకండని,రెండోది రాజకీయాలలో భక్తి లేదా వీరాధన ఉంటే అది అధోపతనానికి దారి అని చెప్పారు.అందుకే రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్ది,వైరుధ్యాలను పరిష్కరించాలని లేకపోతే అవి ప్రజాస్వామ్య పునాదుల్ని నాశనం చేస్తాయని అంబేద్కర్ ఆనాడే హెచ్చరించారు.కాబట్టి నేడు ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సంక్షోభాలను అధిగమించేందుకు పోరాడటమే ఆయనకు నేడు మనమిచ్చే నిజమైన నివాళి.

**(ఏప్రిల్ 14 డాక్టర్ అంబేద్కర్ జయంతి)**

# ఢిల్లీ సీజన్‌లో తొలి ఓటమి

## 12 రన్స్ తేడాతో ముంబై విజయం

## కరుణ్ నాయర్ పోరాటం వృథా

న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ వరుస విజయాల జోరుకు బ్రేక్ పడింది. ఆఖర్లో అనూహ్య తడబాటుతో గెలుపు ముంగిట బోల్తా పడింది. మూడేళ్ల తర్వాత ఐపీఎల్ ఆడిన కరుణ్ నాయర్ (40 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్సర్లతో 89) అద్భుత ఆటతీరుతో జట్టును విజయం ఖాయమనే స్థితికి చేర్చాడు. అయితే 19వ ఓవర్‌లో అశుతోష్ (17) సహా ముగ్గురు రనౌట్‌గా వెనుదిరగడంతో డీసీ మూల్యం చెల్లించుకుంది. దీంతో మరో ఓవర్ ఉండగానే ముంబై 12 పరుగుల తేడాతో రెండో విజయాన్నందుకుంది. అటు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఢిల్లీకిదే తొలి ఓటమి. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. తిలక్ (33 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 59), రికెల్టన్ (25 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 41), సూర్యకుమార్ (28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 40), నమన్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 నాటౌట్) రాణించారు. కుల్దీప్, విప్రజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఢిల్లీ 19 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. పోరెల్ (33) ఫర్వాలేదనిపించాడు. స్పిన్నర్లు కర్ణ్‌కు మూడు, శాంట్నర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కర్ణ్ శర్మ నిలిచాడు.

**కరుణ్ పోరాడినా..:**

భారీ ఛేదనలో ఢిల్లీ మొదటి బంతికే ఓపెనర్ మెక్‌గుర్క్ (0) వికెట్‌ను కోల్పోయింది. కానీ మరో వికెట్ కోసం పది ఓవర్ల వరకు వేచి చూడాల్సి వచ్చింది. ఇందుకు ఇంపాక్ట్ ప్లేయర్ కరుణ్ నాయర్ ఆటతీరే కారణం. నాయర్-పోరెల్ కలిసి రెండో వికెట్‌కు ఢిల్లీ 119 పరుగుల భారీ భాగస్వామ్యం లభించింది. దేశవాళీల్లో అదరగొట్టిన కరుణ్ ఇక్కడా అదే ఫామ్‌ను కనబర్చాడు. ఈ జోడీ ప్రమాదకరంగా మారిన వేళ 11వ ఓవర్‌లో పోరెల్‌ను స్పిన్నర్ కర్ణ్ శర్మ అవుట్ చేశాడు. ఇక్కడి నుంచి ఢిల్లీ ఒక్కసారిగా తడబడింది. తర్వాతి ఓవర్‌లోనే కరుణ్‌ను శాంట్నర్ బౌల్డ్ చేయగా.. కర్ణ్ వరుస ఓవర్లలో స్టబ్స్ (1), రాహుల్ (15)లను అవుట్ చేసి షాకిచ్చాడు. ఇక అక్షర్ (9), విప్రజ్ (14) వైఫల్యంతో చివర్లో అశుతోష్ జోరు పెంచాడు. 12 బంతుల్లో 23 రన్స్ కావాల్సిన వేళ 19వ ఓవర్‌లో అతడు రెండు ఫోర్లు బాది ఉత్కంఠ పెంచాడు. కానీ రెండో పరుగు కోసం వెళ్లిన అశుతోష్‌తో పాటు వరుస బంతుల్లో కుల్దీప్ (1), మోహిత్ (0) కూడా రనౌట్ కావడంతో ముంబై సంబరాలు చేసుకుంది.

కలిసికట్టుగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇన్నింగ్స్‌లో ఓపెనర్ రికెల్టన్, సూర్యకుమార్‌తో పాటు మిడిలార్డర్‌లో తిలక్ వర్మ జట్టుకు అండగా నిలిచారు. అతడికి డెత్ ఓవర్లలో నమన్ ధీర్ అద్భుత సహకారం అందించాడు. ఐదో ఓవర్‌లో విప్రజ్ ఎల్బీతో వెనుదిరగ్గా తొలి వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే కుల్దీప్ గూగ్లీకి రికెల్టన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత సూర్య-తిలక్ జోడీ డీసీ బౌలర్లను ఆడేసుకుంది. 13వ ఓవర్‌లో సూర్య 6,4 తిలక్ 4తో 17 రన్స్ సమకూరాయి. ఇక ఆఖరి ఓవర్‌లో తిలక్ స్లాగ్ స్వీప్ షాట్‌ను ప్రయత్నించగా..బౌండరీ లైన్‌కు అత్యంత సమీపంలో పోరెల్ సూపర్ క్యాచ్ తీసుకోవడంతో ఐదో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ఈ ఓవర్‌లో నమన్ రెండు ఫోర్లతో 11 రన్స్ రాగా 200 దాటింది.







**స్కోరుబోర్డు**

ముంబై: రోహిత్ (ఎల్బీ) విప్రజ్ 18బీ రికెల్టన్ (బి) కుల్దీప్ 41బీ సూర్యకుమార్ (సి) స్టార్క్ (బి) కుల్దీప్ 40బీ తిలక్ (సి) పోరెల్ (బి) ముకేశ్ 59బీ హార్దిక్ (సి) స్టబ్స్ (బి) విప్రజ్ 2బీ నమన్ (నాటౌట్) 38బీ జాక్స్ (నాటౌట్) 1బీ ఎక్స్‌ట్రాలు: 6బీ మొత్తం: 20 ఓవర్లలో 205/5. వికెట్ల పతనం: 1-47, 2-75, 3-135, 4-138, 5-200బీ బౌలింగ్: స్టార్క్ 3-0-43-0బీ ముకేశ్ 4-0-38-1బీ విప్రజ్ 4-0-41-2బీ కుల్దీప్ 4-0-23-2బీ అక్షర్ 2-0-19-0బీ మోహిత్ 3-0-40-0.

ఢిల్లీ: మెక్‌గుర్గ్ (సి) జాక్స్ (బి) చాహర్ 0బీ పోరెల్ (సి) నమన్ (బి) కర్ణ్ 33బీ కరుణ్ (బి) శాంట్నర్ 89బీ రాహుల్ (సి అండ్ బి) కర్ణ్ 15బీ అక్షర్ (సి) సూర్య (బి) బుమ్రా 9బీ స్టబ్స్ (సి) నమన్ (బి) కర్ణ్ 1బీ అశుతోష్ (రనౌట్) 17బీ విప్రజ్ (స్టంప్) రికెల్టన్ (బి) శాంట్నర్ 14బీ స్టార్క్ (నాటౌట్) 1బీ కుల్దీప్ (రనౌట్) 1బీ మోహిత్ (రనౌట్) 0బీ ఎక్స్‌ట్రాలు: 13బీ మొత్తం: 19 ఓవర్లలో 193 ఆలౌట్. వికెట్ల పతనం: 1-0, 2-119, 3-135, 4-144, 5-145, 6-160, 7-180, 8-192, 9-193, 10-193. బౌలింగ్: చాహర్ 3-0-24-1బీ బౌల్ట్ 2-0-21-0బీ బుమ్రా 4-0-44-1బీ శాంట్నర్ 4-0-43-2బీ హార్దిక్ 2-0-21-0బీ కర్ణ్ 4-0-36-3.

# బెంగళూరు ఘన విజయం

## 9 వికెట్లతో రాజస్థాన్ చిత్తు

## జైస్వాల్ అర్ధ శతకం

జైపూర్: ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 65), కోహ్లీ (45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62 నాటౌట్) అర్ధ శతకాలతో చెలరేగడంతో.. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఘన విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 9 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు చేసింది. యశస్వీ జైస్వాల్ (75), ధ్రువ్ జురెల్ (35 నాటౌట్), రియాన్ పరాగ్ (30) రాణించారు. క్రునాల్, భువనేశ్వర్ చెరో వికెట్ పడగొట్టారు. ఛేదనలో బెంగళూరు 17.3 ఓవర్లలో 175/1 స్కోరు చేసి గెలిచింది. దేవ్‌దత్ పడిక్కల్ (40 నాటౌట్) దూకుడుగా ఆడాడు. సాల్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**ఆరంభం నుంచే బాదుడు..:**

రాజస్థాన్ బ్యాటర్లు తడబడిన పిచ్‌పై ఓపెనర్ సాల్ట్ భారీ షాట్లతో విరుచుకుపడడంతో మ్యాచ్ ఏకపక్షమైంది. మరో ఓపెనర్ కోహ్లీతో కలసి సాల్ట్ తొలి వికెట్‌కు 52 బంతుల్లో 92 పరుగులు జోడించడంతో.. బెంగళూరు అలవోకగా గెలిచింది. బౌండ్రీతో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న సాల్ట్‌ను కార్తికేయ అవుట్ చేశాడు. అనంతరం వన్‌డౌన్‌లో వచ్చిన పడిక్కల్‌తో కలసి కోహ్లీ రెండో వికెట్‌కు అజేయంగా 83 పరుగులు జోడించడంతో.. బెంగళూరు మరో 15 బంతులు మిగిలుండగానే గెలుపుగీత దాటింది. ఈ క్రమంలో హసరంగ బౌలింగ్‌లో సిక్స్ బాదిన కోహ్లీ.. టీ20ల్లో తన వందో అర్ధ శతకాన్ని నమోదు చేశాడు.

**శాంసన్ విఫలం..:**

ఓపెనర్ జైస్వాల్ అర్ధ శతకంతో ఆకట్టుకోగా.. జురెల్ ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో రాజస్థాన్ గౌరవప్రద స్కోరు చేసింది. ఆరు ఓవర్లు ముగిసే సరికి రాజస్థాన్ 45/0తో నిలిచింది. అయితే, ఆ తర్వాతి ఓవర్‌లో క్రునాల్ బౌలింగ్‌లో శాంసన్ స్టంపౌట్ కావడంతో.. తొలి వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్‌లో వచ్చిన పరాగ్.. జైస్వాల్‌కు చక్కని సహకారం అందించాడు. ఈ క్రమంలో 13వ ఓవర్‌లో సింగిల్‌తో జైస్వాల్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. ఆ తర్వాతి ఓవర్‌లో పరాగ్‌ను యశ్ అవుట్ చేసి దెబ్బకొట్టాడు. ఇక, హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో జైస్వాల్ ఎల్బీగా వెనుదిరిగాడు. 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కోహ్లీ క్యాచ్‌వదిలేయడంతో బతికిపోయిన జురెల్..తర్వాత ధాటిగా ఆడడంతో స్కోరు 170 మార్క్ దాటింది.







**కోహ్లీకి లైఫ్..:**

7 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద సందీప్ బౌలింగ్‌లో కోహ్లీ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను పరాగ్ నేలపాలు చేశాడు. లాంగ్ ఆన్ నుంచి వచ్చిన పరాగ్.. నిర్లక్ష్యంగా క్యాచ్‌ను అందుకోవడంతో అది చేజారింది.

**క్యాచ్ చేజార్చిన విరాట్..:**

ఫీల్డింగ్‌లో కోహ్లీ ఎంతో చురుగ్గా ఉంటాడనేది తెలిసిందే. అలాంటి విరాట్ చేతిలో పడ్డ బంతి కిందపడిపోవడంతో.. ఫ్యాన్స్ మండిపడుతున్నారు. 17వ ఓవర్‌లో జురెల్ కొట్టిన బంతిని బౌండ్రీ వద్ద నుంచి ముందుకు వచ్చిన కోహ్లీ పట్టినట్టేపట్టి వదిలేశాడు. దీంతో అభిమానులు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు.

**స్కోరుబోర్డు**

రాజస్థాన్: జైస్వాల్ (ఎల్బీ) హాజెల్‌వుడ్ 75, శాంసన్ (స్టంప్డ్) జితేష్ (బి) క్రునాల్ 15, పరాగ్ (సి) కోహ్లీ (బి) యశ్ 30, జురెల్ (నాటౌట్) 35, హెట్‌మయర్ (సి) పడిక్కల్ (బి) భువీ 9, రాణా (నాటౌట్) 4బీ ఎక్స్‌ట్రాలు: 5బీ మొత్తం: 20 ఓవర్లలో 173/4బీ వికెట్ల పతనం: 1-49, 2-105, 3-126, 4-169బీ బౌలింగ్: భువనేశ్వర్ 4-0-32-1, యశ్ దయాళ్ 4-0-36-1, హాజెల్‌వుడ్ 3-0-26-1, క్రునాల్ పాండ్యా 4-0-29-1, లివింగ్‌స్టోన్ 1-0-8-0, సుయాష్ శర్మ 4-0-39-0.

బెంగళూరు: సాల్ట్ (సి) జైస్వాల్ (బి) కార్తికేయ 65, కోహ్లీ (నాటౌట్) 62, పడిక్కల్ (నాటౌట్) 40బీ ఎక్స్‌ట్రాలు: 8బీ మొత్తం: 17.3 ఓవర్లలో 175/1బీ వికెట్ల పతనం: 1-92బీ బౌలింగ్: ఆర్చర్ 4-0-36-0, తుషార్ దేశ్‌పాండే 2-0-21-0, సందీప్ 2.3-0-29-0, తీక్షణ 2-0-21-0, కుమార్ కార్తికేయ 3-0-25-1, హసరంగ 3-0-33-0, పరాగ్ 1-0-10-0.



## ప్రణీత మరోసారి మెస్మరైజ్..!


కన్నడ బ్యూటీ ప్రణీత సుభాష్ ఈ మధ్య కాలంలో సినిమాల్లో ఎక్కువగా కనిపించడం లేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం రెగ్యులర్‌గా కనిపిస్తూ కన్నుల విందు చేస్తోంది. సోషల్ మీడియాలో ఈమె షేర్ చేస్తున్న పోటోలు, వీడియోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ప్రణీత సుభాష్ సొంతం. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం దాటినా కూడా అందం ఏమాత్రం తగ్గలేదు అనడంలో సందేహం లేదు. సోషల్ మీడియాలో ఈమె ఫోటోలు వీడియోలు ఇప్పటికీ వైరల్ అవుతున్నాయి. ఈమె అందం చూస్తే ప్రస్తుతం ఉన్న స్టార్ హీరోయిన్స్ కంటే ఎంతో బెటర్ అనే అభిప్రాయంను నెటిజన్స్ వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి పిల్లల తర్వాత సాధారణంగా సౌత్ హీరోయిన్స్ సినిమాలకు కాస్త దూరం అవుతారు, గ్లామర్ వరల్డ్‌కి సైతం దూరంగా ఉండాలి అనుకుంటారు. కానీ ప్రణీత సుభాష్ మాత్రం పెళ్లికి ముందు ఎలా అయితే ఉందో ఇప్పుడు అదే విధంగా చాలా బిజీగా సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేస్తూ ఉంది. అందంగా ఉన్న ప్రణీత సుభాష్ ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతున్నాయి. తాజాగా మరోసారి ఈమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. లాంగ్ ఫ్రాక్ బ్లాక్ అండ్ వైట్ ఔట్‌ఫిట్‌తో ప్రణీత సుభాష్ చూడముచ్చటగా ఉంది. స్కిన్ షో చేయకున్నా ప్రణీత షేర్ చేసిన ఈ ఫోటోలను నెటిజన్స్ తెగ లైక్ చేస్తూ కామెంట్స్ చేశారు.



## యువ హీరోతో అనుపమ పరమేశ్వరన్ డేటింగ్?

ప్రేమమ్%-% సహా పలు బ్లాక్ బస్టర్ చిత్రాల్లో నటించిన అనుపమ పరమేశ్వరన్ కి తెలుగు ప్రేక్షకులలో భారీ ఫాలోయింగ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ భామ ఇటీవల కోలీవుడ్ లోను వరుస చిత్రాలలో నటిస్తోంది. ఇలాంటి సమయంలో అనుపమ తన కోస్టార్ ధృవ్ విక్రమ్‌తో డేటింగ్ ప్రారంభించిందంటూ ప్రచారం ఊపందుకుంది. ఈ జంట ఘాఢంగా ముద్దు పెట్టుకుంటున్న ఫోటో ఒకటి తాజాగా ఆన్‌లైన్‌లో లీక్ అయింది. ఈ ఫోటో చూడగానే, నెటిజనులు షాక్ కి గురయ్యారు. ఇద్దరూ డేటింగ్ చేస్తున్నారా? అని ఆశ్చర్యపోయారు.

మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ స్పాటిఫైలో అనుపమ - ధ్రువ్ మధ్య షేర్డ్ ప్లే జాబితాను నెటిజనులు గుర్తించిన తర్వాత ఈ ఫోటో లీక్ అయింది. కానీ ప్లేజాబితాలోని పాటలు నెటిజన్లను ఆకర్షించలేదు. దానికి బదులుగా ప్లేజాబితా ఫోటో అభిమానులను రెప్ప వేయకుండా చూసేలా చేసింది. స్పాటిఫై ప్లేజాబితాలో ఎడ్ షీరన్, ర్యాన్ గోస్లింగ్, జస్టిన్ హర్విట్జ్ సహా పలు హిట్ పాటలు ఉన్నాయి. ఈ ఫోటో వైరల్ కావడంతో, నెటిజనులు రకరకాలుగా ఊహిస్తున్నారు. నిజానికి ఈ జోడీ %-%బైసన్%-% అనే తమిళ చిత్రంలో కలిసి నటిస్తున్నారు. ఈ సినిమాకి ఆశించిన బజ్ లేదు. దీంతో బజ్ తెచ్చేందుకు ఇలా పబ్లిసిటీకి దిగారని అనుమానిస్తున్నారు. అందుకే చాలా మంది ఇది పబ్లిసిటీ స్టంటా? అని ప్రశ్నించారు. ఇందులో అనుపమ - ధ్రువ్ స్క్రీన్ ని షేర్ చేసుకుంటున్నారు. లేదా ఇద్దరూ నిజంగా ఒకరిలో ఒకరు ప్రేమను కనుగొన్నారా? అని కొందరు నెటిజనులు ప్రశ్నిస్తున్నారు. కొందరు అభిమానులు నిజంగా అందంగా కనిపించే జంట అని పొగిడేసారు. ఈ జోడీ ఇంకా డేటింగ్ పుకార్లపైనా, లీక్ అయిన ఫోటోపైనా స్పందించలేదు.



## వింక్ బ్యూటీకి గుడ్ జరిగింది..!

ప్రియా ప్రకాష్ వారియర్... ఒక్క సూపర్ హిట్ సినిమా లేకున్నా సోషల్ మీడియాలో ఏకంగా 76 లక్షల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ముద్దుగుమ్మ. ఈమె గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఒక చిన్న సినిమాలో కన్ను గీటి, ముద్దు గన్ను పేల్చడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. తక్కువ సమయంలోనే ఆల్ ఇండియా రేంజ్‌లో ప్రియా ప్రకాష్ వారియర్ సోషల్ మీడియా ద్వారా టాప్ స్టార్‌గా మారిన విషయం తెల్సిందే. ఆ సినిమా పెద్దగా అలరించకున్నా పాపులారిటీని మాత్రం తెచ్చి పెట్టింది. ఆ సినిమాతో వచ్చిన గుర్తింపుతో, ఆ సోషల్ మీడియా క్రేజ్‌తో తెలుగు, తమిళ్, హిందీ సినిమాల్లో కూడా నటించే అవకాశాలు దక్కించుకుంది. ఆ ఒక్క సోషల్ మీడియా పాపులారిటీతో ప్రియా ప్రకాష్ వారియర్ దాదాపు ఆరు.. ఏడు సంవత్సరాలుగా కెరీర్‌ను నెట్టుకు వస్తుంది. కెరీర్‌లో హిట్ లేకపోవడంతో హీరోయి-న్‌గానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ నటిస్తుంది. ఆ మధ్య ధనుష్ దర్శకత్వంలో వచ్చిన సినిమాలో జాబిలమ్మ నీకు అంత కోపమా సినిమాలోనూ ఈమె నటించింది. ఆ సినిమాలో హీరోయిన్‌గా కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించింది. మళ్లీ ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన అజిత్ కుమార్ నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలోనూ ప్రియా ప్రకాష్ వారియర్ నటించింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ రెస్పాన్స్ దక్కించుకోవడంతో పాటు ప్రియా ప్రకాష్ వారియర్ పాత్రకు మంచి మార్కులు పడ్డాయి.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com